ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 201

శనివారం 25 జనవరి 2025 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD



07

## వీరేంద్ర సెహ్వాగ్ జంట విడిపోనుందా..?

# దేశవ్యాప్తంగా పేదలకు కోటి ఇండ్ల నిర్మాణం



తెలంగాణకు అదనంగా ఇవ్వడానికి సిద్ధం

కేంద్రమంత్రి మనోహర్ లాల్ కట్టర్ వెల్లడి

అభివృద్ధి తప్ప రాజకీయం లేదన్న బండి

**ఈ ఏడాది దేశవ్యాప్తంగా కోటి ఇండ్లను నిర్మించబోతున్నట్లు కేంద్రమంత్రి మనోహర్ లాల్ కట్టర్ అన్నారు. తెలంగాణకు రావాల్సిన వాటా కంటే ఎక్కువ ఇండ్లను మంజూరు చేస్తామని అన్నారు.**



**కరీంనగర్,రోమింగ్‌న్యూస్:** కరీంనగర్ డంప్ యార్డ్‌ను ఎత్తేస్తాం. అందుకు అవసరమైన నిధులన్నీ కేంద్రమే మంజూరు చేస్తుందని అన్నారు. . విద్యుత్ విషయంలోనూ తెలంగాణకు సాయం చేసేందుకు సిద్ధంగా ఉ న్నా' అని కేంద్రమంత్రి మనోహర్ లాల్ కట్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో పలు అభివృద్ధి పనులకు కేంద్రమంత్రి మనోహర్ లాల్ కట్టర్ శుక్రవారం శంకుస్థాపనలు, ప్రారంభాలు

మిగతా 2 లో




# తెలంగాణకు 20 లక్షల ఇండ్లు మంజూరు చేయండి

**తెలంగాణ ఇళ్ల నిర్మాణానికి సమగ్రమైన డాటా, పూర్తి ప్రణాళిక**

మెట్రో ఫేజ్-2 కింద ఆరు కారిడార్లను గుర్తించాం

మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు చేయూతనివ్వండి

కేంద్రమంత్రి ఖట్టర్‌తో సమీక్షలో సీఎం రేవంత్ విజ్ఞప్తి



**ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) 2.0 కింద తెలంగాణకు 20 లక్షల ఇండ్లు మంజూరు చేయాలని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. దేశ పట్టణ జనాభాలో ఎనిమిది శాతం ప్రజలు తెలంగాణలో ఉ న్నారని సీఎం తెలిపారు.**


**హైదరాబాద్,రోమింగ్‌న్యూస్:** పీఏఎంవై (యూ)తోపాటు పట్టణాభివృద్ధి, విద్యుత్ శాఖల పనితీరుపై కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ శు క్రవారం సమీక్ష నిర్వహించారు. బేగంపేటలోని హోటల్ ఐటీసీ కాకతీయలో కేంద్ర మంత్రి మనోహర్ లాల్ కట్టర్‌తో అర్బన్ అండ్ పవన్

మిగతా 2 లో

## ట్రంప్ దూకుడుపై తొలిదెబ్బ

సియాటిల్ ఫెడరల్ కోర్టు కీలక నిర్ణయం

జన్మతః పౌరసత్వం రద్దును అడ్డుకున్న కోర్టు



04



## ఆధ్యాత్మిక పర్యాటకంగా భారత్

మహాకుంభమేళాపై విదేశీయుల ఆసక్తి

భారీగా తరలి రావడంతో పెరిగిన ఆదాయం

04

## జామ్‌నగర్‌లో అతిపెద్ద డేటా సెంటర్?

రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ యోచన



04



03

## కాంగ్రెస్ పాలనపై అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి

మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే.. కేసీఆర్ సీఎం

సిరిసిల్లలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న కేటీఆర్

## తెలంగాణలో ముగిసిన గ్రామ సభలు

నాలుగు పథకాల ప్రారంభానికి సిద్ధం

రైతుభరోసాకు నిధులు సమీకరణ

**హైదరాబాద్,రోమింగ్‌న్యూస్:** రాష్ట్ర వ్యాప్తంగా నేటి వరకు 16,348 గ్రామ/వార్డు సభలు పూర్తయ్యాయని ప్రభుత్వం ప్రకటించింది. గత నాలుగు రోజులుగా జరిగిన గ్రామ/ వార్డు సభలకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరై ప్రభుత్వం ప్రారంభించనున్న నాలుగు పథకాలకు సంబంధించి తమ దరఖాస్తులు

మిగతా 2 లో





## బడ్జెట్‌కు చకచకా ఏర్పాటు

**హల్వా వేడుకల్లో పాల్గొన్న నిర్మలా సీతారామన్**

**న్యూఢిల్లీ,రోమింగ్‌న్యూస్:** ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టబోయే కేంద్ర బ్జడెట్‌కు సంబంధించిన పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా ఏటా నిర్వహించే హల్వా వేడుకను నార్త్ బ్లాక్‌లో శుక్రవారం

మిగతా 2 లో

## బనకచర్లపై హరీష్ వ్యాఖ్యలు అసత్యాలు

ప్రభుత్వం అప్రమత్తంగానే ఉందన్న ఉత్తమ్

కౌశిక్ రెడ్డి తీరుపై మండిపాటు

03





## మెగా కృష్ణారెడ్డి కోసం దావోస్ వెళ్లాలా?

గోదావరి జలాలు తరలిస్తుంటే ఏం చేస్తున్నారు

బాబుకు రేవంత్ గురు దక్షిణ చెల్లిస్తున్నారా

మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

02



04

## గత పదేళ్లలో బీఆర్ఎస్ చేసిందేమీ లేదు

అప్పలకుప్పకు వడ్డీలు కట్టలేక పోతున్నాం

దావోస్‌లో తెలంగాణకు భారీగా పెట్టుబడులు

మీడియా సమావేశంలో మహేశ్ కుమార్

## ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల దోపిడీ

నియంత్రణకు ముసాయిదా బిల్లు

ప్రభుత్వానికి సమర్పించిన ఆకునూరి మురళి

02

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం
25 జనవరి
2025







# దేశవ్యాప్తంగా పేదలకు కోటి ఇండ్ల నిర్మాణం

మొదటి పేజీ తరువాయి

చేశారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో కరీంనగర్‌కు చేరుకున్న ఖట్టర్‌కు కేంద్రమంత్రి బండి సంజయ్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్రమంత్రి శంకుస్థాపనలు చేశారు. కరీంనగర్ లో 24 గంటల తాగునీరు, మల్టీ పర్పస్ పార్క్‌ను కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ కట్టర్, బండి సంజయ్ కుమార్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం హౌజింగ్ బోర్డు కాలనీలో జరిగే బహిరంగ సభలో కేంద్రమంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి బండిసంజయ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో తనకు ఎలాంటి విభేధాలు లేవని అన్నారు. గంగుల కమలాకర్‌తోనే కొద్దిగా గ్యాప్ ఉందని త్వరలో అదికూడా సెట్ అయిపోతుందన్నారు. కరీంనగర్‌ను అభివృద్ధి చేయడమే తనకు తెలుసన్నారు. జిల్లా అభివృద్ధి కోసం రాజకీయాలలకు అతీతంగా కలిసి పనిచేయాలని కోరుతున్నామన్నారు. కరీంనగర్ అభివృద్ధి కోసం కంకణం కట్టుకున్నానన్నారు. కరీంనగర్‌లో నాలుగు వేల ఇండ్లకు నిరంతరాయంగా 24 గంటల పాటు నీళ్లు సరఫరాల అవుతాయన్నారు. పేదరికం నుంచి హర్యానా సీఎంగా, కేంద్రమంత్రిగా ఎదిగిన మనోహర్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరగడం ఎంతో గర్వకారణమన్నారు. కరీంనగర్‌లో డంప్ యార్డ్‌తో ప్రజలు అల్లాడిపోతున్నారని.. డంపింగ్ యార్డు సమస్య నుంచి కరీంనగర్ ప్రజలకు విముక్తి కల్పిస్తామన్నారు. స్మార్ట్ సిటీ నిధులను దారి మళ్లిస్తే కొట్లాడి సాధించినట్లు తెలిపారు. వేములవాడ రాజన్న ఆలయాన్ని ప్రసాదం స్కీంలో చేరుస్తున్నామని తెలిపారు. అలాగే కొండగట్టు, ఇల్లందకుంట ఆలయాలను రామాయణ్ సర్క్యూట్‌లో చేరుస్తామన్నారు. సిరిసిల్ల, వంగర ప్రాంతాల్లో నవోదయ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో ఈఎస్ఐ ఆస్పత్రిని కూడా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం 10 ఏళ్లలో తెలంగాణకు 12 లక్షల కోట్లు ఖర్చు చేసిందని, రోడ్ల కోసమే లక్షన్నర కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని, రాష్ట్రంలోని 32 జిల్లాల్లో జాతీయ రహదారులను అభివృద్ధి చేశామని బండి సంజయ్ వెల్లడించారు.

# తెలంగాణకు 20 లక్షల ఇండ్లు మంజూరు చేయండి




మొదటి పేజీ తరువాయి

సెక్టర్‌పై జరిగిన సమీక్షా సమావేశానికి హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రపర్యటనలో ఉన్న కేంద్రమంత్రి ఖట్టర్ ఉదయం కరీంనగర్‌లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం హైదరాబాద్ చేరుకుని సిఎంతో సమీక్షించారు. పీఎంఏవై 2.0లో చేరిన తొలి రాష్ట్రమైన తెలంగాణ ఇళ్ల నిర్మాణానికి సమగ్రమైన డాటా, పూర్తి ప్రణాళికతో సన్నద్ధంగా ఉన్నందున రాష్ట్రానికి 20 లక్షల ఇళు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. దేశంలోని మహా నగరాలైన ఢిల్లీ, చెన్నై, బెంగళూరుతో పోల్చితే హైదరాబాద్‌లో మెట్రో కనెక్టవిటీ తక్కువగా ఉందని, ఈ నేపథ్యంలో మెట్రో ఫేజ్-2 కింద ఆరు కారిడార్లను గుర్తించామని మనోహర్‌లాల్‌కు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కారిడార్ -4: నాగోల్-శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం (36.8 కి.మీ.), కారిడార్-5: రాయదుర్గం-కోకాపేట నియోపొలిస్ (11.6 కి.మీ.), కారిడార్-6: ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), కారిడార్-7: మియాపూర్-పటాన్‌చెరు (13.4 కి.మీ.), కారిడార్-8: ఎల్ బీ నగర్-హయత్ నగర్ (7.1 కి.మీ), కారిడార్- 9: రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం-ఫోర్త్ సిటీ (స్కిల్ యూనివర్సిటీ) (40 కి.మీ.) ఉన్నాయని వివరించారు. మొదటి అయిదు కారిడార్ల (76.4 కిమీ) కోసం డీపీఆర్లు పూర్తయ్యాయని కేంద్ర మంత్రి ఖట్టర్ దృష్టికి సీఎం రేవంత్ రెడ్డి తెచ్చారు. ఈ కారిడార్ల నిర్మాణానికి రూ.24,269 కోట్లు వ్యయమవుతుందన్నారు. డీపీఆర్లు ఆమోదించడంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యం (జేవీ) కింద చేపట్టి నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు చేయూతనివ్వాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మూసీలో మురుగు చేరకుండా నదికి ఇరువైపులా 55 కి.మీ. (మొత్తంగా 110 కి.మీ.) కాలువలు, బాక్స్ డ్రెయిన్లు, ఎస్టీపీల నిర్మాణానికి రూ.10 వేల కోట్లు కేటాయించాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరంతోపాటు సమీపంలోని 27 పట్టణ పాలక సంస్థల పరిధిలో మురుగు నీటి నెట్‌వర్క్ నిర్మాణానికి రూ.17,212 కోట్లతో సమగ్ర మురుగునీటి మేజర్ ప్లాన్ (సీఎస్ఎంపీ) తయారు చేశామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. అమృత్ 2.0 లేదా ప్రత్యేక ప్రాజెక్టుగా సీఎస్ఎంపీని గుర్తించి నిధులు సమకూర్చాలని కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో రెండో పెద్ద నగరమైన వరంగల్ సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మాస్టర్ ఎ÷-లాన్‌ను నోటిఫై చేసిందని సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు. వరంగల్‌లో రూ.41,70 కోట్లతో సమగ్ర భూగర్భ నీటి పారుదల (యూజీడీ) పథకాన్ని చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు.

# ప్రైవేట్ స్కూళ్లలో ఫిజుల దోపిడీ



**హైదరాబాద్,జనవరి 24 :** తెలంగాణలో ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల నియంత్రణపై ముసాయిదా బిల్లు సిద్ధమైంది. ఈ మేరకు ముసాయిదా బిల్లును విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళీ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు. ఫీజుల నియంత్రణ కమిషన్ ఏర్పాటుకు విద్యా కమిషన్ సిఫార్సు చేసినట్టు సమాచారం. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ట్యూషన్ ఫీజులు తల్లిదండ్రులను బెంబేలెత్తిస్తున్నాయి. ప్రభుత్వ నియంత్రణ లేకపోవడం, యాజమాన్యాలు ఏటా సగటున 10-15 శాతం పెంచుకుంటూ పోతుండటంతో ప్రధానంగా చిరుద్యోగులు, మధ్య తరగతి కుటుంబాలకు పెను భారంగా మారాయి. జీవో 91 ప్రకారం కలెక్టర్లు ఛైర్మన్‌గా ఉండే జిల్లా ఫీజుల నియంత్రణ కమిటీ (డీఎఫ్ఆర్‌సీ)లకు నియంత్రించే అధికారం ఉందని గతంలో భావించే వారు. అయితే డీఎఫ్ఆర్‌సీలకు ఆ అధికారం లేదని, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని కమిటీలకు మాత్రమే అధికారం ఉంటుందని సుప్రీంకోర్టు 2016 సెప్టెంబరు 19న తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో ఫీజుల నియంత్రణపై రాష్ట్ర ప్రభుత్వం ముసాయిదా బిల్లు తయారీ బాధ్యతను విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళికి అప్పగించింది. ఇంజినీరింగ్, ఇతర వృత్తి విద్యా కోర్సులకు టీఏఎఫ్ఆర్‌సీ ఉన్నట్లుగానే రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు రాష్ట్రస్థాయిలో ఒక కమిటీని నియమించాలని, దానికి హైకోర్టు విశ్రాంత జడ్జి ఛైర్మన్‌గా ఉండేలా ప్రభుత్వానికి సిపారసు చేయాలని తెలంగాణ విద్యా కమిషన్‌కు హైదరాబాద్ స్కూల్స్ పేరెంట్స్ అసోసియేషన్(హెచ్ఎస్‌పీఏ) విన్నవించింది. ఈ మేరకు సంఘం సంయుక్త కార్యదర్శి వెంకట్, ఇతర ప్రతినిధులు ఇటీవల కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి, సభ్యుడు ఆచార్య పీఎల్ విశ్వేశ్వర్‌రావులకు వినతిపత్రం అందజేశారు. ప్రతి సంవత్సరం ఫీజులను పెంచుకోవడం కాకుండా ఇంజినీరింగ్ కళాశాలల తరహాలో మూడేళ్లకోసారి ఆడిట్ నివేదికలను పరిశీలించి మాత్రమే పెంపును నిర్ణయించాలని కోరారు. సమస్యలను పరిష్కరించేందుకు గ్రీవెన్స్ విభాగాన్ని కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా 2009 నుంచి ఫీజుల నియంత్రణపై వచ్చిన జీవోలు, ఆదేశాలు, హైకోర్టు కార్యకలాపాలు తదితర వాటితో కూడిన పుస్తకాన్ని అందజేశారు.

# తెలంగాణలో ముగిసిన గ్రామ సభలు




మొదటి పేజీ తరువాయి

అందచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గత నాలుగు రోజులుగా గ్రామ సభలు 12,861, వార్డు సభలు 3,487 మొత్తం 16,348 నిర్వహించడం జరిగిందని అధికారులు తెలిపారు. ఈ గ్రామ సభలలో పలువురు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు,అధికారులు పాల్గొన్నారు. ఇకపోతే రైతు భరోసా లెక్క తేలింది. రాష్ట్రవ్యాప్తంగా సాగుకు యోగ్యమైన భూములు 1.49 కోట్ల ఎకరాలు ఉన్నట్టు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. వీటికి సీజన్?కు ఎకరాకు రూ.6 వేల చొప్పున రైతు భరోసా ఇచ్చేందుకు మొత్తం రూ.8,900 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఈ మేరకు నిధులు విడుదల చేయాలని ఆర్థిక శాఖకు ఇప్పటికే ఆదేశాలు వెళ్లినట్టు తెలిసింది. రైతు భరోసా కోసం ప్రభుత్వం నిధులు రెడీ చేసుకున్నది. ఇప్పటికే రూ.10 వేల కోట్ల మేర సేకరించింది. ఇందులో రైతు భరోసాకు అవసరమైన రూ.8,900 కోట్లు మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ త్వరలోనే ఉత్తర్వులు ఇవ్వనున్నట్టు తెలిసింది. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే ఏకకాలంలో కాకుండా ఎప్పటిలాగే విడతల వారీగా రైతు భరోసాను ప్రభుత్వం జమ చేయనుంది. ఎకరాకు రూ.6 వేల చొప్పున కోటి 49 లక్షల ఎకరాలకు ఇస్తే రూ.8,900 కోట్లు అవుతున్నది. గతంతో పోలిస్తే ఇది దాదాపు రూ.1,500 కోట్లు ఎక్కువ. ఏయే గ్రామాల్లో సాగుకు యోగ్యంకాని భూముల డిజిటల్ బ్లాకింగ్ పూర్తయిందో, ఆ గ్రామాల్లో ఎకరా వరకు భూములున్న రైతులకు ఈ నెల 26న పెట్టుబడి సాయం అందనుంది. ఇలా విడతల వారీగా పూర్తి స్థాయిలో నిధులను 15 రోజుల్లోగా రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. అయితే టీజీబీలో ఏపీజీవీబీ విలీనం నేపథ్యంలో ఆయా బ్యాంకుల్లో ఖాతాలు ఉన్న రైతులకు పెట్టుబడి సాయం జమ చేస్తే టెక్నికల్?సమస్యలు వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం గుర్తించింది. ఒకవేళ ఈ నెల 25 కల్లా ఆ బ్యాంకు నుంచి క్లారిటీ వస్తే ఆ మరుసటి రోజు యథావిధిగా నిధులు జమ చేస్తామని, లేదంటే ఆ ఖాతాదారులకు తర్వాత జమ చేస్తామని ఉన్నతాధికారులు వెల్లడించారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రాళ్లు, రప్పులు, కొండలు, వెంచర్లు, హైవేలు, ఇరిగేషన్, ఇతర ప్రభుత్వ అవసరాల కోసం తీసుకున్న భూముల లెక్క తేల్చారు. ఇలాంటివి 3 లక్షల ఎకరాలకు పైగా ఉన్నట్టు గుర్తించారు. గ్రామ సభలు నిర్వహించి, ఆ భూముల సర్వే నెంబర్లను ఆన్‌లైన్?లో బ్లాక్‌చేస్తున్నారు.

# మెగా కృష్ణారెడ్డి కోసం దావోస్ వెళ్లాలలా?

**గోదావరి జలాలు తరలిస్తుంటే ఏం చేస్తున్నారు**

**బాబుకు రేవంత్ గురు దక్షిణ చెల్లిస్తున్నారా**

**మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు**



**హైదరాబాద్,జనవరి 24 :** మెగా కృష్ణారెడ్డి కంపెనీతో ఒప్పందానికి దావోస్ వెళ్ళాలా... అంటూ సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు చురకలంటించారు. జూబ్లీహిల్స్‌లో రోడ్డుకు అటు వైపు సీఎం రేవంత్ రెడ్డి ఉంటారని.. ఇటు వైపు మెగా కృష్ణారెడ్డి ఉంటారని వివరించారు. దావోస్ టూర్‌కు సీఎం రేవంత్ రెడ్డి దారి ఖర్చులు వృధా చేశారని మండిపడ్డారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే హరీష్ రావు విలేకర్లతో మాట్లాడుతూ.. గోదావరి జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకి అన్యాయం జరుగుతుంటే.. రేవంత్ సర్కార్ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందంటూ నిప్పులు చెరిగారు. ఏపీని ఆపడం చేతకాకుంటే.. అఖిల పక్షాన్ని తీసుకు వెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డికి హరీష్ రావు సూచించారు. ఈ వ్యవహారంలో సీఎం రేవంత్ రెడ్డి.. గురదక్షిణ చెల్లించుకొంటున్నట్లు అనుమానం కలుగుతోందని హరీష్ రావు అభిప్రాయపడ్డారు. బనకచర్ల ద్వారా 200 టీఎంసీలను ఆంధ్రప్రదేశ్‌కు తరలించుకు పోతుంటే.. రేవంత్ రెడ్డి మౌనంగా ఉండడం వెనుక కారణం ఏమిటని ఆయన సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసుకున్నదే నీళ్లు, నిధులు, నియామకాల కోసం అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి విషయంలో నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని హరీశ్‌రావు మండిపడ్డారు. గోదావరి నీళ్లను పెన్నాకు తీసుకెళ్లేందుకు ఏపీ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది అని హరీశ్‌రావు తెలిపారు. గోదావరి నీళ్లను ఏపీకి తీసుకెళ్తుంటే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోంది..? బనకచర్ల ఆపాలని ఏపీకి కనీసం లేఖ కూడా రాయలేదు సీఎం రేవంత్ రెడ్డి. నాలుగు ప్రాజెక్టులకు నీళ్ల కేటాయింపులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాజెక్టులకు అనుమతుల సాధనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. బనకచర్లకు నిధుల కోసం చంద్రబాబు కేంద్రానికి లేఖలు రాశారు. చంద్రబాబు లేఖపై కేంద్రంలో దస్త్రం కదులుతోంది. చంద్రబాబు నవంబర్‌లో లేఖ రాస్తే సీఎం రేవంత్ ఏం చేశారు..? బనకచర్లపై ఏపీ ముందుకెళ్తుంటే సీఎం రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నారు..? బనకచర్లతో తెలంగాణకు తీవ్ర నష్టం జరుగుతుంది. బనకచర్లపై ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది అని హరీశ్‌రావు మండిపడ్డారు. కృష్ణా జలాల విషయంలో సెక్షన్ 3ని సాధించిందే కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ అని హరీశ్‌రావు తెలిపారు. ఇప్పుడు సెక్షన్ 3పై ఏపీ సుప్రీంకోర్టుకు వెళ్లింది. ఏపీ సుప్రీంకోర్టుకు వెళ్తే కనీసం కేవియట్ వేయరా..? ప్రభుత్వాన్ని అధికారులు సరిగ్గా మార్గదర్శకత్వం చేయట్లేదు. మంచి అడ్వకేట్లను పెట్టి సెక్షన్ 3 విషయంలో వాదించాలి కదా..? సాగునీటి మంత్రిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి విఫలమయ్యారు. మేడిగడ్డను పండబెట్టారు.. పాలమూరును పక్కకు పెట్టారు. ఇప్పటికైనా నదీ జలాలపై రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలి. అఖిలపక్షం వేస్తే సహకరిం చేందుకు సిద్ధంగా ఉన్నామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఏపీ మాజీ సీఎస్ ఆదిత్యానాథ్‌ను సలహాదారుగా పెట్టుకున్నారు. ఆదిత్యనాథ్ విషయంలో రేవంత్ గురుదక్షిణ చెల్లించారేమో..? తుంగభద్రను గండికొట్టేందుకు ఏపీ, కర్ణాటక యత్నాలు చేస్తున్నాయి. ఏపీ, కర్ణాటక తుంగభద్రకు గండి కొడుతుంటే సీఎం ఏం చేస్తున్నారు..? 2017లో ఏపీ ఇలాంటి ప్రయత్నం చేస్తే గట్టిగా అడ్డుకున్నాం అని హరీశ్‌రావు గుర్తు చేశారు.

# బడ్జెట్‌కు చకచకా ఏర్పాటు



మొదటి పేజీ తరువాయి

సాయంత్రం నిర్వహించారు. ఈ వేడుకలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. బడ్జెట్ తయారీ ప్రక్రియలో పాల్గొన్న అధికారులకు, సిబ్బందికి హల్వాను నిర్మలా సీతరామన్ స్వయంగా పంచిపెట్టారు. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి, ఉన్నతాధికారులు తుహిన్‌కాంత్ పాండే, అజయ్ సేథ్ తదితరులు ఈ వేడుకలో పాలుపంచుకున్నారు. నిర్మలా సీతారామన్ బ్జడెట్ ప్రవేశపెట్టడం ఇది వరుసగా ఎనిమిదోసారి. ఓ వైపు జీడీపీ వృద్ధి మందగించిన వేళ (6.4 శాతం నమోదు కావొచ్చని అంచనా) 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆమె బడ్జెట్ ప్రతిపాదించనున్నారు. ఈ సారి కూడా డిజిటల్ రూపంలోనే బ్జడెట్ ప్రవేశపెట్టనున్నారు. గడిచిన నాలుగు బడ్జెట్లుగా ఇదే పద్ధతిని అనురిస్తున్నారు. బ్జడెట్ తయారీలో ప్రత్యక్షంగా పాల్గొనే అధికారులు, సిబ్బంది - పార్లమెంట్‌లో దానిని ప్రవేశపెట్టేవరకు ఆ నార్త్ బ్లాక్‌లోనే ఉంటారు. వారు బయటకు వెళ్లడానికి వీలుండదు. వారు ఎల్లప్పుడూ సీసీటీవీ కెమెరాలు, భద్రతా సిబ్బంది నిఘాలో ఉంటారు. కనీసం వారు ఫోన్ చేయడానికి కూడా వీలుండదు. ఒకసారి పార్లమెంట్‌లో నిర్మలా సీతారామన్ బ్జడెట్ ప్రసంగం పూర్తయిన తర్వాతే వీరు బయటకు వస్తారు. అంటే దాదాపు మరో వారం రోజుల పాటు వీరికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు ఉండవన్నమాట. 1950లో బ్జడెట్లోని ముద్రణ ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో లీక్ అవ్వడంతో ఈ లాక్-ఇన్ నిర్ణయం తీసుకున్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 25 జనవరి 2025




# ఆర్ ఎం 9 న్యూస్ క్యాలెండర్ ఆవిష్కరించిన టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు గొట్టిపర్తి భాస్కర్ గౌడ్



**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కారంలో పత్రిక మీడియా చానల్స్ పాత్ర కీలకమని సీనియర్ జర్నలిస్ట్ రోమింగ్ న్యూస్ చైర్మన్, చీఫ్ ఎడిటర్ గోట్టిపర్తి భాస్కర్ గౌడ్ అన్నారు. ఆర్ ఏం 9 న్యూస్,బహుజన 99 టివి నూతన సంవత్సర క్యాలెండర్ ని ఆవిష్కరించిన టీయుడబ్లూజే 143 రాష్ట్ర ఉప అద్యక్షుడు గొట్టిపర్తి బాస్కర్ గౌడ్ .ఈ సంధర్భంగా వారు మాట్లాడుతు ప్రజా సమస్యల పరిష్కారంలో మీడియా పాత్ర కీలకమని అన్నారు, ప్రతి మీడియా కూడా ప్రజల వైపు తమ గళం ఎత్తాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం 9 జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గుర్రాల నాగరాజు ఉన్నారు

# వుదయం క్యాలెండర్ ఆవిష్కరించిన సీనియర్ జర్నలిస్టు గొట్టిపర్తి భాస్కర్ గౌడ్



**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కారంలో పత్రిక మీడియా చానల్స్ పాత్ర కీలకమని సీనియర్ జర్నలిస్ట్ రోమింగ్ న్యూస్ చైర్మన్, చీఫ్ ఎడిటర్ గోట్టిపర్తి భాస్కర్ గౌడ్ అన్నారు. వుదయం దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్ ని ఆవిష్కరించిన టీయుడబ్లూజే 143 రాష్ట్ర ఉప అద్యక్షుడు గొట్టిపర్తి బాస్కర్ గౌడ్ .ఈ సంధర్భంగా వారు మాట్లాడుతు ప్రజా సమస్యల పరిష్కారంలో మీడియా పాత్ర కీలకమని అన్నారు, ప్రతి మీడియా కూడా ప్రజల వైపు తమ గళం ఎత్తాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సుధగానీ నవీన్ గౌడ్ ఉన్నారు.

# గుట్టలో రాజస్థాన్ నగల వ్యాపారి ఘరానా మోసం!!

**కోట్ల రూపాయల నగలు...నగదుతో పరారీ**

**యాదగిరిగుట్టలో బోర్డు తిప్పేసిన 'జైభవాని జ్యూయల్లర్స్'**

**కుదువ పెట్టిన బంగారం, అప్పు తీసుకున్న డబ్బుతో పరారైన ఓనర్ జితేందర్ సింగ్ రాథోర్(జిత్తు)**

**జైభవాని జ్యూయల్లర్స్ షాప్ ఎదుట బాధితుల ఆందోళన**

**పక్కనే ఉన్న దుర్గా జ్యూయల్లర్స్ ను కూడా ముట్టడించిన బాధితులు**

**గతంలో దుర్గా జ్యూయల్లర్స్ ఓనర్ దగ్గర పనిచేసిన పరారైన జిత్తు**

**దాదాపుగా రూ.5 కోట్లతో పరారైనట్లు చర్చించుకుంటున్న స్థానికులు**





పరారైన రాజస్థాన్ నగల వ్యాపారి జిత్తు




**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** యాదగిరిగుట్టలో 'జైభవాని జ్యూయల్లర్స్' ఓనర్ బోర్డు తిప్పేశాడు. స్థానిక ప్రజలు డబ్బు కోసం కుదువ పెట్టిన బంగారం, కొత్త బంగారం కోసం ఇచ్చిన నగదు, అప్పు తీసుకున్న డబ్బుతో సదరు మర్వాడీ బంగారం వ్యాపారీ ఉండాయించాడు. శుక్రవారం విషయం తెలుసుకున్న బాధితులు జైభవాని జ్యూయల్లర్స్ ఎదుట ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన 'జితేందర్ సింగ్ రాథోర్'.. బతుకుదెరువు దాదాపుగా పదేళ్ళ క్రితం యాదగిరిగుట్టకు వలస వచ్చి కిరాణం, బంగారం వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. యాదగిరిగుట్టకు వలస వచ్చిన మొదటలో 'దుర్గా జ్యూయల్లర్స్' ఓనర్ వద్ద పనిచేసిన జితేందర్ సింగ్ రాథోర్(జిత్తు).. తర్వాత సొంతంగా వ్యాపారం మొదలుపెట్టారు. మొదట జైభవాని కిరాణా జనరల్ స్టోర్(హెూల్ సేల్) పెట్టిన సదరు మార్వాడీ.. దాదాపుగా ఐదేళ్ల క్రితం 'జైభవాని జ్యూయల్లర్స్' పేరుతో షాప్ ఓపెన్ చేసి బంగారం వ్యాపారం షురూ చేశాడు.

**నమ్మించాడు.. మోసం చేశాడు**

జైభవాని జ్యూయల్లర్స్ ఓపెన్ చేసిన జితేందర్ సింగ్ రాథోర్.. సక్రమంగా లావాదేవీలు చేస్తూ ప్రజలను నమ్మించాడు. అవసరమైన వారికి బంగారం అమ్ముతూనే మరోవైపు బంగారం కుదువ పెట్టుకుని అధిక వడ్డీతో డబ్బులు ఇస్తుండేవాడు. తీసుకున్న డబ్బులు చెల్లించిన వారికి తిరిగి వారి బంగారు ఆభరణాలను వారికి ఇస్తూ నమ్మకం పెంచుకున్నాడు. అంతేకాకుండా స్థానికుల వద్ద డబ్బు అప్పుకు తీసుకుని సమయానికి చెల్లించేవాడు. దీంతో స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున బంగారం కుదువ పెట్టి డబ్బు తీసుకోగా, మరికొందరు అతనికే అప్పు ఇచ్చేవారు. ఇదే అదునుగా భావించిన సదరు వ్యాపారి జితేందర్ సింగ్ రాథోర్.. ప్రజలు కుదువ పెట్టిన బంగారు ఆభరణాలు, కొత్త బంగారు నగల తయారీ కోసం ఇచ్చిన డబ్బుతో పాటు ప్రజల నుండి అప్పు తీసుకున్న డబ్బుతో పరార్ అయ్యాడు.

**'జైభవాని జ్యూయల్లర్స్' ఎదుట బాధితుల ఆందోళన**

గురువారం నుండి జితేందర్ సింగ్ రాథోర్ ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుండడంతో.. అనుమానం వచ్చిన స్థానికులు శుక్రవారం జైభవాని జ్యూయల్లర్స్ షాప్ వద్దకు వెళ్ళి చూడగా తాళం వేసి ఉంది. దీంతో మోసపోయామని తెలుసుకున్న బాధితులు.. జైభవాని జ్యూయల్లర్స్ ఎదుట ఆందోళనకు దిగారు. విషయం దావనంలా పాకడంతో.. స్థానికులతో పాటు బంగారం కుదువ పెట్టినవారు, కొత్త బంగారు ఆభరణాల కోసం డబ్బులు ఇచ్చినవారు, అప్పు ఇచ్చినవారు జ్యూయల్లరీ షాప్ వద్దకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జైభవాని జ్యూయల్లర్స్ పక్కనే ఉన్న దుర్గా జ్యూయల్లర్స్ ను సైతం బాధితులు ముట్టడించారు. బంగారం, డబ్బుతో పరారైన జితేందర్ సింగ్ రాథోర్.. గతంలో దుర్గా జ్యూయల్లర్స్ ఓనర్ల వద్ద పనిచేసేవాడు. దీంతో దుర్గా జ్యూయల్లర్స్ ను ముట్టడించిన బాధితులు.. పరారైన జితేందర్ సింగ్ రాథోర్ జాడ చెప్పాలని ఓనర్లతో గొడవకు దిగారు. కొందరు బాధితులు దర్గా జ్యూయల్లర్స్ లోకి దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. పరిస్థితి అదుపుతప్పుతుం డడంతో పోలీసులు వచ్చి ముందస్తు జాగ్రత్తగా దుర్గా జ్యూయల్లర్స్ షాప్ ను మూసివేయించారు. పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేస్తే న్యాయం చేస్తామని పోలీసులు చెప్పడంతో.. బాధితులు పెద్ద సంఖ్యలో పీఎస్ కు వెళ్లి కంప్లైంట్ ఇచ్చారు. బాధితుల ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి విచారణ షురూ చేశామని, పరారైన జైభవాని జ్యూయల్లర్స్ ఓనర్ జితేందర్ సింగ్ రాథోర్ ను సాధ్యమైనంత తొందరగా పట్టుకుని బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని యాదగిరిగుట్ట సీఐ రమేష్ హామీ ఇచ్చారు. కాగా బాధితులు కుదువ పెట్టిన బంగారు ఆభరణాలు, ఇచ్చిన అప్పులు దాదాపుగా రూ.5 కోట్ల వరకు ఉండవచ్చని స్థానికులు చర్చించుకుంటున్నారు.

**పాత నగలు ఇచ్చి కొత్త నగల కోసం రూ. 2.30 లక్షలు ఇచ్చాను - ఎస్. కే గౌస్, సైదాపురం.**

కొత్త బంగారు నగలు చేపించడం కోసం జైభవాని జ్యూయల్లర్స్ ఓనర్ జితేందర్ సింగ్ రాథోర్ కు తన రెండు తులాల పాత బంగారు ఆభరణాలతో పాటు మరో రూ.2.30 లక్షల నగదు ఇచ్చాను. వారంలోగా నగలు తయారు చేసి ఇస్తానని చెప్పాడు. కానీ ఇలా మోసం చేసి వెళ్తాడని ఊహించలేదు. తనతో పాటు బాధితులందరికీ న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాను.

**త్వరగా పట్టుకుంటాం - యాదగిరిగుట్ట సీఐ. రమేష్**



జైభవాని జ్యూయల్లర్స్ ఓనర్ జితేందర్ సింగ్ రాథోర్ తాము కుదువ పెట్టిన బంగారం, కొత్త నగల కోసం ఇచ్చిన నగదు, అప్పు ఇచ్చిన డబ్బుతో పరార్ అయ్యాడని బాధితులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు షురూ చేశాం. నిందితుడని వీలైనంత తొందరగా పట్టుకుని బాధితులకు న్యాయం జరిగేలా చూస్తాం.











# సింగిరెడ్డి మల్లారెడ్డికి అభినందనలు

**రైతులకు అండగా నిలుస్తున్న మల్లారెడ్డి**

**శుభాకాంక్షలు తెలిపిన విద్యావేత్త కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి**



రామన్నపేట, జనవరి 23:(రోమింగ్ న్యూస్): రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్న వలిగొండ రామన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్, రామన్నపేట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి మల్లారెడ్డికి ప్రముఖ విద్యా సేవకుడు, పర్యావరణ పరిరక్షణ, అభివృద్ధి మండలి జాతీయ సలహాదారు, తెలంగాణ గ్రీన్ అంబాసిడర్, తెలంగాణ రైతు హక్కుల సాధన సమితి నేషనల్ అడ్వైజర్, లోటస్ లాప్ గ్రూప్ పబ్లిక్ స్కూల్స్ ఛైర్మన్ డాక్టర్ లయన్, విద్యా రత్న కోమటి రెడ్డి గోపాల్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు దేశానికి వెన్నెముక లాంటి వారని, వారి సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వారి అభివృద్ధికి మద్దతు తెలుపుతూ, సుస్థిర వ్యవసాయ విధానాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గుంటకమల చేత ఎడారి భూమిని సస్యశ్యామలం చేయడం సాధ్యమవుతుందని, రైతులకు తగిన గౌరవం ఇవ్వడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. రైతులకు విత్తనాలు, సేంద్రియ పద్ధతులు నేర్పావలిచి ఆవశ్యకత ఏంత్తో ఉన్నదామి గోపాల్ రెడ్డి తెలియజేశారు.

# ఫార్మసీ విద్యతో ఉజ్వల భవిష్యత్తు

## క్లినోక్సీ సీఈవో వేమవరపు సతీష్




**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** ఫార్మసీ విద్యతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని క్లినోక్సీ సంస్థ సీఈవో వేమవరపు సతీష్ తెలిపారు. యాదగిరిగుట్ట మండలం వంగపల్లిలోని స్వామి వివేకానంద ఫార్మసీ కాలేజ్ లో క్లినోక్సీ సంస్థ ఆధ్వర్యంలో ఫార్మసీ విద్య ప్రాముఖ్యత, క్లినికల్ ట్రయల్స్, డేటా మేనేజ్మెంట్, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై నిర్వహించిన జాతీయ సదస్సు, శిక్షణా తరగతుల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ శిక్షణా తరగతుల వల్ల విద్యార్థులకు క్లినికల్ రీసెర్చ్, ఫార్మకో విజిలెన్స్, రెగ్యులేటరీ అఫైర్స్, ఫార్మా ఇండస్ట్రీ ఉద్యోగాలు సాధించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఫార్మసీ రంగంలో అభివృద్ధి చెందుతున్న ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ, సాంకేతిక పురోగతులు, అత్యాధునిక ఆవిష్కరణలు ఫార్మసీ విద్యకు భవిష్యత్తును సూచిస్తున్నాయన్నారు. ఆరోగ్య సంరక్షణ నిపుణులను తయారు చేయడంలో ఫార్మసీ విద్య కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఔషధ రంగంలో ఉపాధి కల్పనకు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. కోవిడ్ అనంతరం ఫార్మసీ విద్యకు అంతర్జాతీయంగా ఫుల్ డిమాండ్ పెరిగిందని, ఫార్మసీ కళాశాల్లో సీట్ల కోసం విద్యార్థులు పోటీ పడుతున్నారన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని శ్రమిస్తే ఫార్మసీ తర్వాత కచ్చితమైన ఉపాధి అవకాశాలు తలుపు తడుతాయన్నారు. దేశాలు ఫార్మాస్యూటికల్ కంపెనీలు స్టార్టప్ రంగంలో దూసుకుపోతున్నాయని, తద్వారా ఉపాధి అవకాశాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని తెలిపారు. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాల్లో ఔషధ రంగం ప్రథమ స్థానంలో ఉందని, భవిష్యత్తు ఫార్మా రంగానిదే అని చెప్పడానికి ఇదే మంచి ఉదాహరణ అని పేర్కొన్నారు. ఫార్మసీ రంగంలో రోజురోజుకు పెరిగిపోతున్న సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యను అభ్యసిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని సూచించారు. ఈ కార్యక్రమంలో క్లినోక్సీ సంస్థ ప్రతినిధులు డాక్టర్ రమాకాంత్, రవితేజ, కళాశాల చైర్మన్ అనిత, సెక్రటరీ వెంకట్ రెడ్డి, డైరెక్టర్ ఉదయ్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ హేమమాలిని, కళాశాల స్టాఫ్ డాక్టర్ మత్స్యగిరి, ఏవో వేణుగోపాల్ రెడ్డి, స్టూడెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 25 జనవరి 2025




# చంపుతానని బెదిరించిన రౌడీషీటర్... విలేఖరిల అరెస్ట్

**రిమాండ్ కు తరలింపు.**

**వివరాలు వెల్లడించిన వేములవాడ రూరల్ సి.ఐ శ్రీనివాస్.**

వేములవాడ, జనవరి 24: (రోమింగ్ న్యూస్): వేములవాడ రూరల్ సి.ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ బోయిన్పల్లి కి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి హెూటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అతని కూతురు వివాహం నిశ్చయం అయినందున అతనికి డబ్బు అవసరమై అతనికి బోయిన్పల్లి లో ఉన్న ఇంటిని అమ్మకం గురించి బోయిన్పల్లి మండల విలేకరి అయిన రవి ని సంప్రదించి ఇల్లు అమ్మటంలో సహాయపడమని కోరగా రవి వేములవాడకు చెందిన కదారి తిరుపతి అనే రౌడీషీటర్ ని తీసుకుని వచ్చి శ్రీనివాస్ కి పరిచయం చేసి నీ ఇల్లు కొంటాడని చెప్పి అట్టి ఇంటిని 77 లక్షల రూపాయలకు ధర మాట్లాడి,భయానాగా 50వేల రూపాయలు ఇచ్చి ఒక ఒప్పంద పత్రాన్ని తయారు చేశారు. అందులో శ్రీనివాస్ భార్య లక్ష్మి ఇల్లు 77 లక్షలకు అమ్మినట్టు కదారి తిరుపతి స్నేహితుడైన చొప్పరి శివ కొంటున్నట్టుగా రాసి అందులో దురుద్దేశపూర్వకంగా కేవలం 20 లక్షలు చెల్లించిన తర్వాత రిజిస్ట్రేషన్ చేసే విధంగా తప్పుడు ఒప్పంద పత్రాన్ని వ్రాశారు. మిగతా 57 లక్షల ప్రస్తావన ఒప్పంద పత్రములు రాయకుండా జాగ్రత్తపడ్డారు. రిజిస్ట్రేషన్ కోసం ఇల్లు పత్రాలని శ్రీనివాస్ ని అడగగా అవి బ్యాంకు తాకట్టులో ఉన్నాయని తెలుపగా శ్రీనివాస్ అకౌంట్ కు 3,50,000/- ఒకసారి రెండు లక్షల 80,000/- మరొకసారి పంపి అందులో నుండి లోన్ రెండు లక్షల రూపాయలు కట్టి బ్యాంకు పత్రాలను విడిపించుకుని మిగతా డబ్బులను డ్రా చేయించుకొని అట్టి డబ్బులను తిరుపతి తీసుకున్నాడు.



జనవరి 10వ తారీఖు నాడు స్లాట్ బుకింగ్ చేయించుకొని శ్రీనివాస్ మరియు అతని భార్య లక్ష్మిని వేములవాడ పిలిపించగా రిజిస్ట్రేషన్ కి సంతకాలు పెట్టమనగా, డబ్బులు ఇవ్వలేదు కదా డబ్బులు ఇచ్చాక రిజిస్ట్రేషన్ అనుకున్నాం కదా మిగతా 57 లక్షలు గురించి కూడా ఒప్పంద పత్రంలో రాయలేదు కదా ఇవన్నీ లేకుండానే రిజిస్ట్రేషన్ కి సంతకం పెట్టమంటున్నారు ఏంటి అని అనుమానం వచ్చి శ్రీనివాస్ అర్జెంటు ఇంటి దగ్గర పని ఉందని చెప్పి ఇంటికి వెళ్లిపోయాడు. తర్వాత జరిగిన మోసాన్ని గ్రహించగా, రౌడీ షీటర్ కదారి తిరుపతి బోయిన్పల్లి లోని శ్రీనివాస్ ఇంటికి వెళ్లి శ్రీనివాస్ని అతని కుటుంబ సభ్యులు బెదిరించి నా గురించి తెలుసు కదా నేను నాలుగు మర్డర్ కేసులు చేశాను ఏ ఒక్క దాంట్లో శిక్ష పడలేదు నా మీద రౌడీషీట్ ఉంది నేను చెప్పినట్టు డాక్యుమెంట్లు ఇచ్చి రిజిస్ట్రేషన్ కి సంతకాలు పెట్టకపోతే నిన్ను నీ కుటుంబం మొత్తాన్ని చంపేస్తా అని బెదిరించి ఇంటి ఒరిజినల్ డాక్యుమెంట్స్ తీసుకెళ్లాడు. తర్వాత శ్రీనివాస్ విలేఖరి రవి దగ్గరికి వెళ్లి తిరుపతి నీ స్నేహితుడు అంటే ఇల్లు అమ్ముతనన్నాను కదా డబ్బులు ఇవ్వకుండానే ఇలా బెదిరిస్తున్నాడు ఏంటి అని అడగగా, రవి అతని గురించి నీకు తెలుసు కదా అతను అనుకున్నాడంటే ఏదైనా చేస్తాడు అవసరమైతే చంపేసినా చంపుతాడు, సక్కగా ఒక మాట మాట్లాడకుండా రిజిస్ట్రేషన్ కి సంతకం పెట్టు, డబ్బులు సంగతి తర్వాత మాట్లాడదాం అని రవి కూడా శ్రీనివాస్ ని బెదిరించి పంపించేశాడు.

దీంతో వాళ్లకి భయపడి ఏం చేయాలో పాలుపోక చివరికి పోలీసులను ఆశ్రయించి రక్షణ కోరగా బోయినపల్లి పోలీసులు కేసు నమోదు చేసి ఫిర్యాదుని చంపుతానని బెదిరించి పత్రాలు తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేయకుంటే చంపుతానని బెదిరిస్తున్న కదారి తిరుపతి మరియు రిపోర్టర్ రవి లను పట్టుకుని వారి నుండి భూమి యొక్క పత్రాలు మరియు శ్రీనివాస్ దగ్గర తీసుకున్న మూడు చెక్కుల్లో నుండి ఒక చెక్కు మరియు ఒప్పంద పత్రాన్ని స్వాధీనం చేసుకొని సీజ్ చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని వేములవాడ రూరల్ సి.ఐ శ్రీనివాస్ తెలిపారు.

# చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

## కరపత్రం విడుదల పల్లగొర్ల మోదీరాందేవ్



భువనగిరి : వచ్చే నెల ఫిబ్రవరి 6,7న జరగబోయే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భువనగిరి పట్టణ కేంద్రంలో విద్యార్థులతో కలిసి కరపత్రం ఆవిష్కరణ చేసి అభివాదం చేశారు %దీష% విద్యార్థి సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లగొర్ల మోదీరాందేవ్ వారు మాట్లాడుతూ బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజ్యసభ %వీూ% ఆర్ కృష్ణన్న ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద ధర్నా జాతీయ సెమినార్లు కార్యక్రమానికి తరలిరావాలని అన్నారు చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అలాగే %ూజ, ూ,దీజ% బీసీ జనాభా దమాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని దేశవ్యాప్తంగా ఫీజు రీయింబర్స్మెంట్ అమలు చేయాలని కేంద్రంలో బీసీ ప్రత్యేక మంత్రుత్వ శాఖ ఏర్పాటు చేయాలని జనాభా గణనలో బీసీ కుల గణన చేయాలని బడ్జెట్లో విద్యార్థులకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించాలని దేశంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని గవర్నమెంట్ సంస్థలో ప్రైవేటీకరణ నిషేధించాలని బీసీ క్రిమిలేయర్ ను ఎత్తివేయాలని ప్రమోషన్లలో రిజర్వేషన్లు వర్తింపజేయాలని బడ్జెట్లో బీసీలకు 2లక్షల కోట్లు కేటాయించాలని బీసీలంట్లే కేవలం ఓట్లు వేసే యంత్రాలుగనే చూస్తున్నాయి ఈ ప్రభుత్వాలు,,దేశ గవర్నమెంట్ ఉద్యోగాలలో బీసీలు 7 శాతం గిట్ల లేకపోవడం సిగ్గుచేటు రాజకీయంగా 12 శాతం దాటలేదు బీసీలు రాష్ట్ర ప్రభుత్వం ఏమో బీసీలకు స్థానిక సంస్థల 42% రిజర్వేషన్ అని చెప్పి దాన్ని అమలు చేయకుండా జాప్యం చేస్తున్నారు విద్యార్థులకు రావాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ విడుదల చేయాలని సంక్షేమాష్టలకు సొంత భవనాలు నిర్మించాలని మెస్చార్జులు 3,000లకు పెంచాలని బీసీల కోసం ఢిల్లీలో ధర్నా చేస్తాం బీసీ బిల్లుకు మద్దతు అని చెప్పి ఇంతవరకు దాని ఊసే లేదు బీసీ బిల్లుకు మద్దతు తెలపకపోతే రాష్ట్ర ప్రభుత్వాని గద్దె దింపుతామని హెచ్చరించారు ఈ సమావేశంలో విద్యార్థి సంఘం నాయకులు వేముల అనిల్ కుమార్, శరత్ యాదవ్, వట్టెం మధు, మహేష్,ఎలేష, రాజు గౌడ్, భాస్కర్, చంటి ముదిరాజ్, విజయ్ కుమార్, వినయ్ తదితరులు పాల్గొన్నారు

# కేంద్రమంత్రి పర్యటనలో పొంగులేటి ఆగ్రహం

**కలెక్టర్, ఎస్పీల తీరుపై మండిపడ్డ మంత్రి**

కరీంనగర్,జనవరి 24 : కేంద్రమంత్రి పర్యటనలో అధికారుల తీరుపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కరీంనగర్ మండిపడ్డారు. కలెక్టర్ ,ఎస్పీ ఎక్కడ అంటూ ప్రశ్నించారు. మహిళా కలెక్టర్ అని కూడా చూడకుండా.. ఆమెను కేంద్ర మంత్రుల ముందు అవమానించేలా మాట్లాడారు. కామన్ సెన్స్ ఉందా లేదా అంటూ కలెక్టర్ పమేలా సత్పతిపై నోరు పారేసుకున్నారు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. దీంతో కలెక్టర్ అవమానంగా ఫీలై, కార్యక్రమం ముగిసే వరకూ ముభావంగా ఉన్నారు. రీంనగర్లో కేంద్ర పట్టణాభివృద్ధి, విద్యుత్, గృహ నిర్మాణ శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్, హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ శుక్రవారం ఉదయం పర్యటించారు. ఈ పర్యటనలో మంత్రి పొంగులేటి.. కలెక్టర్ పమేలా సత్పతిపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వాట్ ఆర్ యూ డూయింగ్.. వాట్ ఈజ్ దిస్ నాన్ సెన్స్ అంటూ తీవ్రంగా ఆగ్రహించారు. అసలు కామన్ సెన్స్ ఉందా..? అని కలెక్టర్ ముఖం చూస్తూ సీరియస్ అయ్యారు. ఎస్పీ ఎక్కడ అంటూ ప్రశ్నించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కలగజేసుకుని.. కనీసం ఏసీపీ కూడా లేరని అన్నారు. కలెక్టర్పై పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నోరు పారేసుకున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.


# వక్ఫ్ సవరణ జెపిసిలో గందరగోళం

## సమావేశం నుంచి విపక్ష ఎంపల సస్పెన్షన్

న్యూఢిల్లీ,జనవరి 24 : వక్ఫ్ సవరణ బిల్లుపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ లో భాగమైన ప్రతిపక్ష ఎంపిలు శుక్రవారం సస్పెండ్కు గురయ్యారు. సస్పెండ్కు గురైన ఎంపిలలో మహ్మద్ జావైద్, కళ్యాణ్ బెనర్జీ(టిఎంసి), ఎ.రాజా (డిఎంకె), అసదుద్దీన్ ఒవైసీ, నాసీర్ హుస్సేన్ (ఎఐఎంఐఎం), మొహిబుల్లా నద్వీ, ఎం అబ్దుల్లా (ఎస్పి), అరవింద్ సావంత్, నదీముల్ హక్ (శివసేన యుబిటి), ఇమ్రాన్ మసూద్ ( కాంగ్రెస్)లకు చెందినవారు ఉన్నారు. బిజెపి సమావేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతోందని ప్రతిపక్ష ఎంపి, టిఎంసి నేత కళ్యాణ్ బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం కోసం ఢిల్లీకి చేరుకున్న తర్వాత సభకు సంబంధించిన అంశాలు, తేదీలను మార్చినట్లు చెప్పారని అన్నారు. ఫిబ్రవరి5న జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం సమావేశాన్ని ముగించేందుకు బిజెపి త్వరపడుతోందని కళ్యాణ్ బెనర్జీ మండిపడ్డారు. జనవరి 21 వరకు టూర్ ఉందని, జనవరి 24,25 తేదీల్లో సమావేశం ఉంటుందని టూర్ ముగిసిన తర్వాత రాత్రి నోటీసు ఇచ్చారని అన్నారు. జనవరి 30,31 తేదీలకు వాయిదా వేయాలని ఎ.రాజా సహా పలువురు చైర్మన్ను అభ్యర్థించారని, కానీ వారు నిరాకరించారని అన్నారు. జనవరి 22 సాయంత్రం 4.00 గంటలకు సవరణ అందించాలని తమకు నోటీసులు పంపారని అన్నారు. మొదట క్లాజ్ వారీగా చర్చ జరపాలని నిర్ణయించారని, గురువారం రాత్రి ఇక్కడకి రాగానే, జనవరి 27న సమావేశాన్ని షెడ్యూల్ చేశామని మాటమార్చిందని అన్నారు. జెపిసి సమావేశంలో ప్రతిపక్షాల ప్రవర్తన పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఉందని బిజెపి ఎంపి నిషికాంత్ దూబె ఆరోపించారు. సభలో ప్రతిపక్షాలు గందరగోళం సృష్టించాయని అన్నారు. తదుపరి సమావేశం జనవరి 27 ఉంటుందని, జనవరి 29న సమర్పణ ఉంటుందని అన్నారు. ప్రతిపక్షాలు ముఖ్యంగా అసదుద్దీన్ ఒవైసీ, జమ్ముకాశ్మీర్ ప్రతినిధులు పాల్గనలేదని, మిర్వాయిజ్ ఉమర్ ఫరూక్ను ఆహ్వానించామని చెప్పారని అన్నారు. ప్రతిపక్షాల సూచన మేరకు క్లాజ్ వారీగా చర్చ జరిపేందుకు చైర్మన్ సమావేశాన్ని వాయిదా వేశారని నిషికాంత్ మాట మార్చారు. సమావేశం జనవరి 27న జరగుతుందని, జనవరి 29న స్పీకర్కు సమర్పిస్తామని దూబె అన్నారు.

# ప్రసిద్ధి ఆలయాలను సందర్శిస్తున్న ప్రియాంక చోప్రా

## దోమకొండ గడికోట మహాదేవుడి ఆలయాన్ని సందర్శించిన ప్రియాంక



హైదరాబాద్,జనవరి 24 : బాలీవుడ్ స్టార్ నటి, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా ప్రస్తుతం హైదరాబాద్లో ఉంటున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పలు ప్రసిద్ధ ఆలయాలను సందర్శిస్తున్నారు. మొన్నటికి మొన్న చిలుకూరు బాలాజీ టెంపుల్ను సందర్శించి ప్రత్యేక పూజలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా తెలంగాణ రాష్ట్రంలోని మరో ఆలయాన్ని పీసీ సందర్శించారు. కామారెడ్డి జిల్లాలోని దోమకొండ గడికోట మహాదేవుడి ఆలయాన్ని ప్రియాంక శుక్రవారం సందర్శించారు. హైదరాబాద్ నుంచి ఇవాళ ఉదయం కారులో బయల్దేరి దోమకొండ చేరుకున్నారు. అక్కడ గడికోటలో కొలువుదీరిన ప్రసిద్ధ మహాదేవుని ఆలయానికి వెళ్లారు. ఆలయంలోని సోమసూత్ర శివలింగానికి పీసీ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఇందుకు సంబంధించిన వీడియోని పీసీ తన ఇన్స్టా స్టోరీస్లో షేర్ చేసింది. పొగమంచుకు సంబంధించిన వీడియోను కూడా పంచుకుంది. ప్రస్తుతం ఈ వీడియోలు వైరల్ అవుతున్నాయి. పాపులర్ అమెరికన్ సింగర్ నిక్ జోనస్ను పెళ్లి చేసుకున్న తర్వాత బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా హాలీవుడ్కు పరిమితమైపోయిందని తెలిసిందే. ప్రస్తుతం ఈ బ్యూటీ ఎస్ఎస్ఎంబీ 29తో మళ్లీ సిల్వర్ స్క్రీన్పై మెరిసేందుకు రెడీ అవుతుందని బీటౌన్ సర్కిల్ టాక్. ఈ నేపథ్యంలో ప్రియాంకా చోప్రా టొరంటో నుంచి హైదరాబాద్లో ల్యాండైంది. దీనిక్కారణం మహేశ్ బాబు చేయబోతున్న కొత్త సినిమానేనట. ప్రియాంకా చోప్రా.. ఆర్ఆర్ఆర్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి, మహేశ్ బాబు కాంబోలో వస్తోన్న గ్లోబల్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్ ఎస్ఎస్ఎంబీ 29 అనౌన్స్మెంట్ ఈవెంట్లో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిందని నెట్టింట కథనాలు రౌండప్ చేస్తున్నాయి. ఇదే నిజమైతే ఐదేళ్ల తర్వాత ప్రియాంకా చోప్రా చేయబోతున్న భారతీయ సినిమా ఎస్ఎస్ఎంబీ 29 కానుంది. అయితే, దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది. ఇక రాజమౌళితో సినిమా కోసం మహేశ్బాబు ఇప్పటికే మేకోవర్ మార్చుకుని.. లాంగ్ హెయిర్, గడ్డం, పోనీ టెయిల్ లుక్లో కనిపిస్తూ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాడు. ఆఫ్రికన్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్గా రానున్న ఈ చిత్రాన్ని దుర్గా ఆర్ట్స్ బ్యానర్పై కేఎల్ నారాయణ తెరకెక్కిస్తున్నారు.

# రథసప్తమికి తిరుమలలో భారీగా ఏర్పాట్లు


**ఉదయం సూర్యప్రభ ..సాయంత్రం చంద్రప్రభ వాహనం**

**అధికారులతో కలసి పరిశీలించిన ఇవో**

**విఐపి బ్రేక్ దర్శనలకు అనుమతి ఉండదని వెల్లడి**



తిరుమల,జనవరి 24 : ఫిబ్రవరి 4వ తేదీన తిరుమలలో జరగనున్న రథసప్తమి ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని టీటీడీ ఈవో జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుమలలోని అన్నమయ్య భవన్లో శుక్రవారం అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరితో కలిసి వివిధ విభాగాల అధికారులతో ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. రథసప్తమి రోజున ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏడు వాహనాలపై శ్రీ మలయప్ప స్వామి వారు ఊరేగింపు ఉంటుందని తెలిపారు. భక్తులు గ్యాలరీలోకి ప్రవేశం, నిష్క్రమణ ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్యాలరీలలో ఉండే భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు అందించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భద్రత, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనంతరం అధికారులతో కలిసి నాలుగు మాడ వీధుల్లో ఏర్పాట్ల పరిశీలించారు. రథసప్తమి సందర్భంగా పలు సేవలు, ప్రివిలేజ్ దర్శనాలు రద్దు చేసినట్లు ఈవో పేర్కొన్నారు. అష్టదళ పాద పద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను రద్దు చేసినట్లు వెల్లడించారు. ఫిబ్రవరి 3 నుంచి 5 వరకు స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్లు జారీ ఉండవని, ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేశామని వివరించారు. బ్రేక్ దర్శనాలకు సంబంధించి ఫిబ్రవరి 3న ఎలాంటి సిఫార్సు లేఖలు స్వీకరించబోమని స్పష్టం చేశారు. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు ఉన్న భక్తులు వేచి ఉండకుండా నిర్ణీత సమయంలో మాత్రమే వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద రిపోర్ట్ చేయాలని కోరారు. ఈ సమీక్షలో తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సాల్ తదితరులు పాల్గొన్నారు.



తిరుమలలో మినీ బ్రహ్మోత్సవాల తరహాలో జరగనున్న రథసప్తమి ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. రథసప్తమి వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లపై తిరుమలలోని అన్నమయ్య భవన్లో అదనపు ఈవో, వివిధ విభాగాల అధికారులతో ఈవో సమీక్షించారు. భక్తులు గ్యాలరీల్లోకి ప్రవేశించే, నిష్క్రమణ ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్యాలరీలలో ఉండే భక్తులకు సకాలంలో అన్నప్రసాదాలు, తాగునీరు అందించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భద్రత, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం.. అదనపు ఈవో వెంకయ్యచౌదరి, అధికారులతో కలిసి తిరుమల మాడవీధుల్లో ఏర్పాట్లను ఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ.. 'శ్రీవారి ఉత్సవాల్లో రథసప్తమి అత్యంత ముఖ్యమైనది. ఏటా శుక్లపక్ష సప్తమి తిథిలో సూర్య జయంతి సందర్భంగా తిరుమలలో రథసప్తమిని వైభవంగా నిర్వహిస్తారు. ఈ వేడుకకు సుమారు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉంది. వేడుకల్లో భాగంగా స్వామివారు సప్త వాహనాలపై భక్తులకు దర్శనమిస్తారు. ఫిబ్రవరి 4న ఉదయం 5.30 గంటలకు సూర్యప్రభ వాహన సేవతో రథసప్తమి వేడుకలు ప్రారంభమవుతాయి. అదే రోజు రాత్రి చందప్రభ వాహనసేవతో శ్రీమలయప్పస్వామివారి వాహన సేవలు ముగుస్తాయి' అని ఈవో తెలిపారు.

# గ్రామ సభలు, వార్డు సభల్లో గందరగోళం

**ప్రభుత్వ విప్కు తగిలిన నిరసన సెగ**

**యాదాద్రి భువనగిరి,జనవరి24** : రాష్ట్రంలో గ్రామసభలు, వార్డు సభలు తీవ్ర గందరగోళం మధ్య కొనసాగుతున్నాయి. ప్రజా ప్రతినిధులు, అధికారుల అలసత్వంపై ప్రజలు తిరగబడుతున్నారు. తాజాగా యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు ప్రజల నుంచి నిరసన సెగ ఎదురైంది. వివరాల్లోకి వెళ్తే..ఆత్మకూరు(ఎం)లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభకు ముఖ్యఅతిథిగాబీర్ల ఐలయ్య హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పథకాల అమలు తీరుపై గ్రామస్తులు నిలదీశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. జాబితాలో ఉన్న పేర్లు చదవడం కాదు.. అర్హులైన వారి పేర్లను ఇప్పుడే ఇక్కడే గ్రామ సభలో ప్రకటించాలని నిలదీశారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆందోళనకారులకు సర్దిచెప్పారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 25
జనవరి 2025





# కాంగ్రెస్ పాలనపై అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి

**మళ్లీ వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే..కెసిఆర్ సిఎం**

**సిరిసిల్లలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న కెటిఆర్**



రాజన్న సిరిసిల్ల,జనవరి 24 : కాంగ్రెస్ పాలనపై అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని మళ్లీ ఎన్నికలు రాగానే ప్రజలు తగిన నిర్ణయం తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని, వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమే, సిఎంగా కెసిఆర్ ఉంటారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎంఎల్ఏ కెటిఆర్ అన్నారు. సిరిసిల్లలో శుక్రవారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ ఛైర్‌పర్సన్‌లు, కౌన్సిలర్ల పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో స్థానిక తెలంగాణ భవన్‌లో వారిని సత్కరించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ.. పదవీకాలం పూర్తయిన మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. బిఆర్ఎస్‌కు పోయింది అధికారమే కానీ ప్రజల అభిమానం కాదని, మనలోని పోరాట పటిమ దూరం కాలేదని అన్నారు. కాంగ్రెస్‌తో బిఆర్ఎస్‌ను ప్రజలు పోల్చుకుని చూస్తున్నారని, గత పాలనలో ప్రజలు ఒక్కరోజు కూడా కష్టాలు పడలేదన్నారు. కాంగ్రెస్ అబద్ధసే హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న గ్రామసభల్లో ప్రజలు కాంగ్రెస్‌పై తిరుగబడుతున్నారని అన్నారు. ప్రజాపాలనలో గత సంవత్సరం డిసెంబర్ నెలలో కోటి ఆరు లక్షల మంది దగ్గర దరఖాస్తులు తీసుకోగా, వాటిని బుట్టదాఖలు చేసి మళ్లీ దరఖాస్తులు కోరడంతో కేవలం జిరాక్స్ సెంటర్ల వారు మాత్రమే బాగుపడుతున్నారని వ్యాఖ్యానించారు. గ్రామసభల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీరు వల్ల ప్రజలు అధికారులపై తిరగపడుతున్నారని, దీనివల్ల అధికారులు ఇబ్బందులు పడాల్సి వస్తున్నదన్నారు. గ్రామ సభలకు కాంగ్రెస్ మంత్రులు, శాసనసభ్యులు ఎందుకు హాజరవడం లేదని నిలదీశారు. సోషల్ మీడియాపై కేసులు పెట్టడం, జైళ్లకు పంపడంపై దృష్టి తగ్గించి పాలనపై దృష్టి సారించాలని రేవంత్ సర్కార్‌కు హితవు పలికారు. ప్రభుత్వ ఏడాది పాలనలో రూ. లక్షా 40 వేల కోట్లు అప్పులు తెచ్చారన్నారు. గ్రామాల, పట్టణాల అభివృద్ధికి కొత్తగా నిధులివ్వకపోగా గతంలో బిఆర్ఎస్ ఇచ్చిన నిధులను నిలిపివేశారన్నారు. కాంగ్రెస్ నేతల మాటలు కోటలు దాటుతున్నాయని, చేతలు మాత్రం గడుప దాటడం లేదన్నారు. బిఆర్ఎస్ ప్రణాళికాబద్ధంగా పనిచేయడం వల్ల గ్రామాలు పట్టణాలు వృద్ధి సాధించాయన్నారు. దేశంలో 3 శాతం కన్నా తక్కువ జనాభా ఉన్న తెలంగాణకు స్వచ్ఛతలో 30 శాతం అవార్డులు వచ్చాయన్నారు. సమష్టి కృషితోనే ఇది సాధ్యపడిందన్నారు. బిఆర్ఎస్ పాలనలో ఎప్పుడు ఆడ బిడ్డలు నీటికోసం బిందెలు, కుండలతో రో÷-డడెక్కలేదన్నారు. తెలంగాణలో ప్రస్తుతం క్రైమ్ రేట్ పెరిగిందని, మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయని, గాలి మోటార్లలో తిరుగుతున్న మంత్రులు, ముఖ్యమంత్రి ప్రజా సమస్యలను గాలికి వదిలేశారన్నారు. కోటి 67 లక్షల మంది మహిళలు మహాలక్ష్మి పథకం క్రింద ఇచ్చే రూ.2500 కోసం ఎదురుచూస్తున్నారన్నారు. తులం బంగారం ఎటుపాయె అన్నారు.100 రోజుల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తామని 400 రోజులు గడిచినా ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చల్మెడ లక్ష్మీనర్సింహారావు, మాజీ ఎంఎల్ఏ సుంకె రవిశంకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ ఛైర్‌పర్సన్లు జిందం కళచక్రపాణి, రామతీర్థపు మాధవిరాజు, కౌన్సిలర్లు ఇతరులు పాల్గొన్నారు.

# బనకచర్లపై హరీష్ వ్యాఖ్యలు అసత్యాలు

**ప్రభుత్వం అప్రమత్తంగానే ఉందన్న ఉత్తమ్**

**కౌశిక్ రెడ్డి తీరుపై మండిపాటు**



**హైదరాబాద్,జనవరి 24 :** ఏపీ ప్రభుత్వం చేపట్టిన బనకచర్ల ప్రాజెక్టు విషయంలో చాలా అప్రమత్తంగా ఉన్నామని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. బనకచర్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'భారాస హయాంలో నదీ జలాల విషయంలో చాలా నష్టం జరిగింది. మేం అధికారంలోకి వచ్చాక నష్టం తగ్గించే ప్రయత్నం చేస్తున్నాం. భారాస పొరపాట్లను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. బనకచర్ల విషయంలో అభ్యంతరాలు తెలుపుతూ ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్‌కి లేఖ రాశాం. ఏపీ పునర్విభజన చట్టానికి ఇది విరుద్ధం, ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించవద్దని విజ్ఞప్తి చేశాం' అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఇదిలావుంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని ఉద్దేశించి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. కౌశిక్ రెడ్డి తీరు మార్చుకోకపోతే.. రాజకీయ భవిష్యత్ ఉండదని అన్నారు. ఇటీవల ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభివృద్ధి సమావేశంలో కౌశిక్ రెడ్డి తీరు పట్ల అసహనం వ్యక్తం చేసిన ఉత్తమ్ కుమార్ రెడ్డి.. మంత్రిగా తాను స్టేజి మీద ఉండగానే అల్లరి చేయడం లీడర్ లక్షణం కాదని అన్నారు. యువ రాజకీయ నాయకుడైన కౌశిక్ రెడ్డికి అంత ఆవేశం పనికి రాదని అన్నారు. కౌశిక్ రెడ్డితో తనకు ఎలాంటి రాజకీయ సంబంధాలు లేవని.. కౌశిక్ రెడ్డి తీరు మార్చుకోకపోతే భవిష్యత్ లో ఇబ్బంది పడతారని అన్నారు.

# పసిడి ధరలు మరింత పైపైకి

**83వేలు దాటిన పదిగ్రాముల బంగారం ధర**

**న్యూఢిల్లీ,జనవరి 24 :** బంగారం ధర మరోమారు అందనంతంగా అమాంతంగా మరింత పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో దీనికి భారీగా డిమాండ్ ఏర్పడింది. దీంతో దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాముల పసిడి ధర రూ.83 వేలు దాటింది. ఈ మార్కు దాటడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. 99.9 స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల పసిడి రూ.200 పెరిగి రూ.83,100కి చేరుకున్నట్లు ఆలిండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం కూడా రూ.200 పెరిగి రూ.82,700కి చేరినట్లు అసోసియేషన్ పేర్కొంది. అటు వెండి సైతం కిలోకు రూ.500 మేర పెరిగింది. క్రితం ట్రేడింగ్‌లో రూ.93,500గా ఉన్న వెండి కిలో తాజాగా రూ.94 వేల మార్కుకు చేరుకుంది. అంతర్జాతీయ విపణిలో బంగారం ఔన్సు 2780 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. వెండి 31.32 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన ట్రంప్ టారిఫ్‌ల విషయంలో ఎలా వ్యవహరిస్తారనే అంశంపై ఇంకా అనిశ్చితి కొనసాగుతోంది. ఎన్నికల వేళ ప్రపంచ ఆర్థికంపై ప్రభావం చూపేలా వ్యాఖ్యలు చేసిన ట్రంప్.. ఇతర అంశాల్లోనూ ముందుందు ఎలా వ్యవహరిస్తారనే దానిపైనా ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో సురక్షిత పెట్టుబడి సాధనంగా పసిడిని భావిస్తుండడంతో దీనికి డిమాండ్ పెరుగుతోందని యాక్సిస్ సెక్యూరిటీస్‌లో రీసెర్చ్ అనలిస్ట్ దేవేయ గగలానీ అభిప్రాయపడ్డారు. కేంద్రం ప్రవేశపెట్టనున్న బ్జడెట్, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై తీసుకునే నిర్ణయాలు మ-ున్ముందు బులియన్ మార్కెట్లో బంగారం ధర గమనాన్ని నిర్దేశిరచనున్నాయని ఎల్‌కేపీ సెక్యూరిటీస్‌కు చెందిన అనలిస్ట్ జతిన్ త్రివేది పేర్కొన్నారు.

# పేదల కోసం పరితపించిన కర్పూరీ ఠాకూర్

**జయంతి వేడుకల్లో మంత్రి కిషన్ రెడ్డి**

**హైదరాబాద్,జనవరి 24 :** భారతరత్న కర్పూరి ఠాకూర్.. పేదల కోసం తన జీవితాన్ని అంకితం చేశారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో కర్పూరి ఠాకూర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద కిషన్ రెడ్డి, పార్టీ శ్రేణులు నివాళులు అర్పించారు. తర్వాత బీజేపీ-2025 డైరీని కిషన్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో కర్పూరి ఠాకూర్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నా మన్నారు. సోషలిస్టు నాయకుడిగా విద్యార్థి దశలోనే కర్పూరి అనేక పోరాటాలకు రూపకల్పన చేశారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ బడుగు, బలహీన వర్గాల కోసం జీవితాన్ని అంకితం చేశారని చెప్పారు. బిహార్‌కు విద్యాశాఖ మంత్రిగా, రెండుసార్లు ముఖ్యమంత్రిగా సేవలు అందించారని.. అప్పట్లోనే విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారని కిషన్ రెడ్డి గుర్తు చేశారు.దేశ వ్యాప్తంగా భాజపా అధ్వర్యంలో కర్పూరి ఠాకూర్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. విద్యార్థి దశలోనే ఆయన అనేక పోరాటాలకు రూపకల్పన చేశారు. ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాల కోసం ఆయన జీవితాన్ని అంకితం చేశారు. బిహార్ రాష్ట్రానికి విద్యా శాఖ మంత్రిగా సేవలు అందించిన ఆయన.. అప్పట్లోనే విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. ఓబీసీల అభ్యున్నతి కోసం కర్పూరి ఠాకూర్ విశేషమైన సేవలు అందించారు. పార్టీలకు అతీతంగా జన నాయకుడిగా కర్పూరి ఠాకూర్ పేరు తెచ్చుకున్నారు' అని కిషన్‌రెడ్డి తెలిపారు.

# మేడ్చల్ జిల్లాలో దారుణం

**యువతి హత్య...పెట్రోల్ పోసి తగులబెట్టిన దుండగులు**

**మేడ్చెల్,జనవరి 24 :** మేడ్చల్ జిల్లాలో దారుణం జరిగింది. 25 ఏళ్ల యువతిని బండరాళ్లతో కొట్టి కిరాతకంగా హత్య చేశారు గుర్తు తెలియని దుండగులు. యువతిని హత్య చేసిన అనంతరం మృతదేహాన్ని పెట్రోల్ పోసి తగులబెట్టారు నిందితులు. మేడ్చల్ జిల్లాలోని మునీరాబాద్?లో ఈ ఘటన జరిగింది. స్థానికులు ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. యువతి హత్యపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతురాలు ఎవరు..? ఇక్కడకి ఎలా వచ్చింది..? ఎవరితో వచ్చింది..? అన్న విషయాలపై ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. అలాగే.. మేడ్చల్ జిల్లాలో నమోదైన మిస్సింగ్ కేసుల వివరాలు ఆరా తీస్తున్నారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఇటీవల రాష్ట్ర రాజధాని హైదరాబాద్?లో చోటు చేసుకుంటున్న వరుస హత్యలు నగరవాసులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. రెండు వారాల క్రితం నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మణికొండ మున్సిపాలిటీ పుప్పాల్ గూడ అనంత పద్మనాభ స్వామి దేవాలయం గుట్టపై జరిగిన డబుల్ మర్డర్ సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటన మురుకవముందే.. తాజాగా మీర్?పేట్లో ఒళ్లు గగుర్పొడిచే హత్య జరిగింది. అనుమానంతో ఓ మాజీ ఆర్మీ జవాన్ భార్యను అత్యంత కిరాతకంగా హతమార్చాడు. చంపిన అనంతరం మృతదేహాన్ని ముక్కలు ముక్కలు చేసి ప్రెజర్ కుక్కర్ లో ఉడకబెట్టాడు. అనంతరం ఆ శరీర భాగాలను ఎండబెట్టి పొడిగా మార్చి దగ్గర్లోని చెరువులో పడేశాడు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతుండగానే.. తాజాగా మేడ్చల్?లో యువతి దారుణ హత్యకు గురి కావడం గమనార్హం.

# పార్కులు, ప్రభుత్వ స్థలాల కబ్జాలపై ఫిర్యాదులు

**అమీన్‌పూర్ మున్సిపాలిటీలో హైడ్రా సమగ్ర సర్వే**

**హైదరాబాద్,జనవరి 24 :** హైదరాబాద్ అమీన్‌పూర్ మున్సిపాలిటీలో సమగ్ర సర్వేకు హైడ్రా సిద్ధమైంది. రహదారులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల కబ్జాలపై హైడ్రా అధికారులకు ఫిర్యాదులు వచ్చాయి. అమీన్‌పూర్ మున్సిపాలిటీలో ఆక్రమణలపై నిగ్గు తేల్చే పనిలో హైడ్రా అధికారులు ఉన్నారు. తమ కాలనీలోని పార్కులు, రహదారులతో పాటు కొన్ని ఎ÷-లాట్లను పక్కనే ఉన్న గోల్డెన్ కీ వెంచర్స్ వారు ఆక్రమించారంటూ హైడ్రాకు వెంకటరమణ కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 152, 153లో ఉన్న వెంకటరమణ కాలనీలో హైడ్రా అధికారులు సర్వే చేశారు. పార్కులు, రహదారులు కబ్జాకు గురైనట్లుగా నిర్ధారణకు హైడ్రా అధికారులు వచ్చారు. వెంకటరమణ కాలనీలోకి చొరబడి గో÷-డలెన్ కీ వెంచర్స్ ఆక్రమణలకు పాల్పడినట్లు ప్రాథమిక నిర్ధారణ చేశారు. ఈ విషయంలో మరింత లోతైన సర్వే చేయించేందుకు హైడ్రా అధికారులు చర్యలు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ సర్వే ఆఫ్ ఇండియా , ఏడీ సర్వే సంయుక్త ఆధ్వర్యంలో జాయింట్ సర్వే చేసేందుకు హైడ్రా అధికారులు ప్రయత్నం చేశారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని వెంకటరమణ కాలనీకి ఆనుకుని పలు కాలనీల నుంచి కూడా హైడ్రాకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఇలా ఫిర్యాదులు అందిన నేపథ్యంలో సమగ్ర సర్వే చేసేందుకు హైడ్రా అధికారులు సిద్ధమయ్యారు. అందరి సమక్షంలో పారదర్శకంగా జరిగే ఈ సర్వేలో భాగస్వామ్యం కావాలని హైడ్రా అధికారులు కోరారు. హైడ్రా సర్వే అంటూ చుట్టుపక్కల ఉన్న కాలనీ వాసులను గో÷-డలెన్ కీ వెంచర్స్ నిర్వాహకులతో పాటు.. పలువురు ఆక్రమణదారులు తప్పుదోవ పట్టిస్తున్నారు. వారి ఆక్రమణలు కప్పి పుచ్చుకోడానికి చేస్తున్న ప్రయత్నాలకు ఎవరూ బలి కావద్దని హైడ్రా అధికారులు సూచించారు. ఇప్పటికే పలు ఆరోపణల నేపథ్యంలో గో÷-డలెన్ కీ వెంచర్స్ ఆస్తులను ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టరేట్(ఈడీ) అటాచ్ చేసిన విషయం విధితమే. అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని ఆర్టీసీ కాలనీ, రంగారావు వెంచర్, చక్రపురి కాలనీ వాసులు కూడా ఏమైనా కబ్జాలుంటే ఫిర్యాదు చేయాలని.. ఈ సమగ్ర సర్వేలో వారిని కూడా భాగస్వామ్యం చేస్తామని హైడ్రా అధికారులు చెప్పారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని కాలనీ వాసులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని.. ఏమైనా ఫిర్యాదులుంటే హైడ్రా కార్యాలయానికి వచ్చి నేరుగా ఫిర్యాదు చేయాలని హైడ్రా అధికారులు సూచించారు.

# గత పదేళ్లలో బీఆర్ఎస్ చేసిందేమీ లేదు

**అప్పలకుప్పకు వడ్డీలు కట్టలేక పోతున్నాం**

**దావోస్‌లో తెలంగాణకు భారీగా పెట్టుబడులు**

**పటాన్‌చెరు కాంగ్రెస్ వ్యవహారంపై విచారణ**


**మీడియా సమావేశంలో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్**



**హైదరాబాద్,జనవరి 24 :** భారాస గత పదేళ్లలో రాష్ట్రానికి చేసిందేమీ లేదని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. భారాస ప్రభుత్వం తెచ్చిన పెట్టుబడులూ పెద్దగా ఏమీ లేవని చెప్పారు. ప్రతిపక్షాలు ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'దావోస్‌లో ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్లడం వల్లే పెట్టుబడిదారులకు నమ్మకం కుదిరింది. తెలంగాణ పెవిలియన్ రద్దీగా మారింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక సంస్థలు ముందుకొచ్చాయి. మమ్మల్ని విమర్శించే ప్రతిపక్షాలు ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని అన్నారు. ప్రజలను మభ్యపెట్టడం.. ఆచరణ సాధ్యంకాని హామీలివ్వడమే భారాస పని. గత ప్రభుత్వ పాలనతో నెలకు రూ.ఆరున్నర వేల కోట్ల వడ్డీ కడుతున్నాం. మంచి పనులు జరుగుతున్నప్పుడు ప్రశంసించడం నేర్చుకోండి. తాజాగా రాష్ట్రానికి రానున్న పెట్టుబడులతో 50వేల నుంచి 75 వేల ఉద్యోగాలు లభించే అవకాశముంది' అని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఏ పార్టీ వాళ్ళు అని తాము చూడడం లేదని.. పెద్దవాళ్ళకి పథకాలు ఇస్తున్నామని వెల్లడించారు. పెట్టుబడి పెట్టడానికి అనేక కంపెనీలు వస్తాయని.. అందులో మేఘా కృష్ణారెడ్డి కంపెనీ ఒకటన్నారు. పెట్టుబడులపై ఎప్పుడంటే అప్పుడు చర్చకు సిద్ధం అంటూ మాజీ మంత్రి కేటీఆర్‌కు పీసీసీ చీఫ్ సవాల్ విసిరారు. సీఎం దావోస్ పర్యటన తెలంగాణకు ధమాకా అన్నారు. పెట్టుబడుల విషయంలో తెలంగాణలో ఒక చరిత్ర నెలకొందన్నారు. కాంగ్రెస్ ఉంటేనే పెట్టుబడులు వస్తాయని మరోసారి నిరూపితమైందని తెలిపారు. విదేశీ పెట్టుబడిదారులకు కాంగ్రెస్‌పై నమ్మకం ఉందన్నారు. కాంగ్రెస్ జవాబుదారీతనంపై పెట్టుబడిదారులకు నమ్మకం ఉందన్నారు. రైజింగ్ 2050 నినాదం గేమ్ చెంజర్‌గా మారిందన్నారు. తనకి తాను సుపర్ స్టార్‌గా చెప్పుకునే కేటీఆర్ పదేండ్లలో ఎన్ని పెట్టుబడులు తెచ్చారని ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్ల కాలంలో 27 వేల కోట్లు మాత్రమే పెట్టుబడులు తెచ్చారని అన్నారు. కేసీఆర్‌కు విజన్ లేకపోవడం వల్లే రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ విమర్శలు గుప్పించారు. ఇకపోతే కేసీఆర్ ఫోటోను పెట్టుకుంటా.. నాకు ఇష్టమైతేనే రేవంత్ రెడ్డి ఫోటో పెడతా ' అంటూ పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సీరియస్ అయ్యారు. గూడెం మహిపాల్ రెడ్డి మాటలను తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలపై కమిటీ రిపోర్ట్ ఇస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో కొత్తగా చేరిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో కొంత సమస్య ఉందని.. కమిటీ వేశామని.. కమిటీ అన్ని విషయాలపై అధ్యయనం చేస్తుందని పీసీసీ చీఫ్ చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారన్న అంశంపై కూడా కమిటీ అధ్యయనం చేస్తుందని చెప్పారు. పార్టీలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. గతంలో ఎమ్మెల్యేల ద్వారానే లబ్ధిదారుల ఎంపిక జరిగిందని తెలిపారు. పటాన్ చెరు నియోజకవర్గంలో పాత కొత్త ఇబ్బందులు ఉన్నాయన్నారు. అలాగే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడిన అంశాలను కూడా పరిశీలిస్తున్నామన్నారు. కమిటీ పరిశీలన తర్వాత సరైన నిర్ణయం తీసుకుంటామని పీసీసీ చీఫ్ వెల్లడించారు.

# యూజీసీ ముసాయిదాకు వ్యతిరేకంగా తీర్మానం చేయాలి : మాజీ ఎంపీ వినోద్‌కుమార్

హైదరాబాద్,జనవరి 24 : యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ కొత్త నిబంధనలపై అనేక రాష్ట్రాలు నిరసన తెలుపుతున్నాయని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వినోద్ కుమార్ తెలిపారు. ఈ క్రమంలో తెలంగాణ అసెంబ్లీలో కూడా యూజీసీ ముసాయిదాకు వ్యతిరేకంగా తీర్మానం చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం వినోద్ కుమార్ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తమిళనాడు అసెంబ్లీ యూజీసీ నిబంధనలకు వ్యతిరేకంగా తీర్మానం చేసి పంపింది. ఫెడరల్ స్ఫూర్తిని మంట గలుపుతున్నారని తమిళనాడు సీఎం స్టాలిన్ కేంద్రప్రభుత్వంపై మండిపడ్డారు. కేరళ సీఎం కూడా యూజీసీ ప్రతిపాదనలను వ్యతిరేకించారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షమైనప్పటికీ జేడీయూకి చెందిన బీహార్ సీఎం నితీష్ కుమార్ కూడా యూజీసీ ప్రతిపాదనలు వ్యతిరేకించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంకా స్పందించలేదు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ సీఎం అయినప్పటికీ యూజీసీ ముసాయిదాపై స్పందించడం లేదు. తెలంగాణ అసెంబ్లీలో యూజీసీ ముసాయిదాకు వ్యతిరేకంగా తీర్మానం చేయాలని డిమాండ్ చేస్తున్నాం అని వినోద్ కుమార్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ అభిప్రాయాలను యూజీసీ ఛైర్మన్ జగదీశ్ కుమార్‌కు ఈ రోజే పంపామని మాజీ ఎంపీ తెలిపారు. యూజీసీ ముసాయిదా రాష్ట్రాల హక్కులను హరించే విధంగా ఉన్నాయి. తక్షణమే కొత్త ప్రతిపాదనలు విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. వీసీలను నియమించే అధికారం గవర్నర్‌కు కట్టబెట్టడం అప్రజాస్వామికం. డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెట్టాలి.. వీసీలను మాత్రం కేంద్రం నియమిస్తుందా..? ఇది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం అని వినోద్ కుమార్ స్పష్టం చేశారు. తెలంగాణలో జాతీయ రహదారులకు సంబంధించి నితిన్ గడ్కరీని కలిసి వినతి పత్రం ఇస్తాం. సిద్ధిపేట, సిరిసిల్ల, వేములవాడలో పెండింగ్ జాతీయ రహదారులపై చర్చిస్తామని వినోద్ కుమార్ తెలిపారు.



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 25
జనవరి 2025





# ట్రంప్ దూకుడుపై తొలిదెబ్బ

### సియాటిల్ ఫెడరల్ కోర్టు కీలక నిర్ణయం


### జన్మతః పౌరసత్వం రద్దును అడ్డుకున్న కోర్టు



వాషింగ్టన్,జనవరి 24 : అమెరికా అధ్యక్షుడిగా ఇటీవలే ప్రమాణం స్వీకారం చేసిన డొనాల్డ్ ట్రంప్ నిర్ణయానికి తొలిదెబ్బ తగిలింది. వలస వచ్చిన వారికి అమెరికా గడ్డపై పిల్లలు పుడితే.. ఆ చిన్నారులకు సహజంగా వచ్చే పౌరసత్వ హక్కు ను ట్రంప్ రద్దు చేసిన విషయం తెలిసిందే. దీనిపై అమెరికాలో సియాటిల్ ఫెడరల్ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఆ రద్దు ఆదేశాలను న్యాయమూర్తి అడ్డుకున్నారు. ఆ ఆదేశాలను తాత్కాలికంగా నిలిపివేశారు. ట్రంప్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. జనవరి 20న యూఎస్ అధ్యక్షుడిగా ప్రమాణం స్వీకారం చేసిన వెంటనే ట్రంప్ పలు కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. పారిస్ ఒప్పందంతో పాటు డబ్ల్యూహెచ్‌వో నుంచి వైదొలగడం, ప్రభుత్వ ఉద్యోగుల ఇంటి నుంచి పని విధానాన్ని రద్దు చేయడం, ప్రభుత్వ నియామకాలపై నిషేధం, క్యాపిటల్ హిల్‌పై దాడిచేసిన వారికి క్షమాభిక్ష పెట్టడం, వలస వచ్చిన వారి పిల్లలకు జన్మతః వచ్చే పౌరసత్వ రద్దు నిర్ణయం ఉన్నాయి. దీంతో ట్రంప్ నిర్ణయంపై డెమొక్రాట్‌ల నేతృత్వంలోని వాషింగ్టన్, అరిజోనా, ఇల్లినాయిస్, ఓరేగాన్ రాష్ట్రాలు కోర్టును సియాటిల్ ఫెడరల్ కోర్టును ఆశ్రయించాయి. అమెరికా రాజ్యాంగం 14వ సవరణ ప్రకారం.. పౌరసత్వ చట్టం నిబంధనలకు ట్రంప్ ఆదేశాలు వ్యతిరేకమని వాదించాయి. అమెరికాలో పుట్టిన ఎవరికైనా పౌరసత్వం లభిస్తుందని న్యాయవాదులు వాదించారు. దీంతో సియాటిల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ జాన్ కాఫ్నర్.. జన్మతః పౌరసత్వ రద్దు కార్యనిర్వాహక ఆదేశాలను తాత్కాలికంగా నిలుపుదల వేస్తూ తీర్పు ఇచ్చారు. ఇక పౌరసత్వ రద్దుకు సంబంధించి ఇప్పటికే 22 రాష్ట్రాలు, పలు పౌరసంఘాలు కోర్టుల్లో పలు దావాలు వేశాయి.

# జామ్‌నగర్‌లో అతిపెద్ద డేటా సెటర్ ?

### రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ యోచన



ముంబై,జనవరి 24 : దావోస్ సదస్సులో పలు దిగ్గజ కంపెనీలో భారత్‌లో డేటా సెంటర్‌ల ఏర్పాటుకు ఒప్పందాలు చేసుకున్నాయి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద డేటా సంటర్లకు ఒప్పందాలు జరిగాయి. ఇదే సమయంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ ప్రపంచంలోనే అతిపెద్ద డేటా సెంటర్‌ను భారత్‌లో నిర్మించాలని చూస్తున్నారు. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో దీన్ని ఏర్పాటు చేయాలని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే నిజమైతే ఇదో పెద్ద విప్లవాత్మక అడుగుగా భావించాలి. దీని కోసం ఎన్విడియా నుంచి అధునాతన ఏఐ చిప్‌లను కొనుగోలు చేయనుంది. ఈ డేటా సెంటర్ మూడు గిగావాట్స్ సామర్థ్యంతో ఏర్పాటు కావచ్చని అంచనాలున్నాయి. ప్రపంచవ్యాప్తంగా టెక్ దిగ్గజ సంస్థలైన మైక్రోసాఫ్ట్, అమెజాన్, గూగుల్.. ఏఐ సేవల కోసం డేటా సెంటర్ సామర్థ్యాలను విస్తరించాలని చూస్తున్నాయి. దీని కోసం భారీగా ఖర్చు చేస్తున్నాయి. తాజాగా ఓపెన్ ఏఐ, సాఫ్ట్ బ్యాంక్, ఒరాకిల్ సంయుక్తంగా ఓ భారీ కృత్రిమ మేధ ప్రాజెక్టుకు సిద్ధమైన సంగతి తెలిసిందే. స్టార్‌గేట్ ప్రాజెక్ట్ కోసం 500 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టే ప్రణాళికలను కూడా ప్రకటించాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రపంచంలోనే అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటు చేయాలని అంబానీ చూస్తుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీని నిర్మాణ పనులు అనుకొన్నట్లే ముందుకు సాగితే ప్రస్తుతం ఈ విభాగంలో భారత్ సామర్థ్యాలు పెరుగుతాయి. దేశంలో మొత్తం సామర్థ్యం గిగావాట్ కంటే తక్కువే ఉంది. కొత్త ప్రాజెక్ట్‌తో ఇది మూడింతలు పెరగవచ్చు. ఇది దేశానికి ప్రధాన మైలురాయిగా మారుతుంది. భారత్‌లో కృత్రిమ మేధ కంప్యూటింగ్ మౌలిక వసతులతో పాటు ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేయడం కోసం రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎన్విడియా గతేడాది అక్టోబర్‌లో చర్చలు జరిపాయి. ఇందుకోసం భారీ స్థాయిలో పెట్టుబడులు పెడతామని స్పష్టం చేశాయి. భారత్‌లో ప్రతిఒక్కరికీ ఏఐని అందుబాటులోకి తీసుకురావడమే తన లక్ష్యమని అంబానీ నాడు తెలిపారు. ఇప్పటికే రిలయన్స్ చమురు శుద్ధి, పెట్రోకెమికల్ కార్యకలాపాలకు వేదికగా ఉన్న జామ్‌నగర్ తాజాగా పునరుత్పాదక ఇంధనం, ఏఐ రంగంలో కీలక పాత్ర పోషించనుంది.

# కెన్నడీ హత్యలో నిజాలు బయటకు వచ్చేనా?

### దర్యాప్తు చేసిన కనుగొనాలనే తపాత్రయంలో ట్రంప్

### అధ్యక్షుడి ఆదేశాలతో కదలనున్న ఫైలు



వాషింగ్టన్,జనవరి 24 : అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ పాలనలో జోరు పెంచారు. నిత్యం పదుల సంఖ్యలో కార్యనిర్వాహక ఉత్తర్వుల పై సంతకాలు చేస్తున్న ఆయన.. తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్. కెన్నడీ , మాజీ సెనెటర్ రాబర్ట్ ఎఫ్. కెన్నడీ, పౌర హక్కుల కార్యకర్త మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ హత్యలకు సంబంధించిన దస్త్రాలను బహిర్గతం చేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు.జాన్ ఎఫ్.కెన్నడీ హత్యకు సంబంధించిన పూర్తి రికార్డులను ఎలా బహిర్గతం చేస్తారన్న దానిపై 15 రోజుల్లోపు ప్రణాళిక సమర్పించాలని నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్‌ను ట్రంప్ ఈ ఉత్తర్వుల్లో ఆదేశించారు. ఇక, రాబర్ట్ ఎఫ్. కెన్నడీ, మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ హత్యల దస్త్రాల విడుదలపై 45 రోజుల్లోగా ప్లాన్ ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకాలు చేసిన తర్వాత ఓవల్ ఆఫీసు నుంచి ట్రంప్ మీడియాతో మాట్లాడారు. 'ఇవి చాలా పెద్ద విషయాలు. ఇందులో నిజానిజాల కోసం కొన్ని దశాబ్దాలుగా చాలా మంది ప్రజలు ఎదురుచూస్తున్నారు. హత్యల వెనుక ఏం జరిగిందో తెలుసుకునే హక్కు బాధిత కుటుంబాలు, అమెరికా ప్రజలకు ఉంది. అన్ని విషయాలు బయటకొస్తాయి. ప్రజా ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నా' అని అధ్యక్షుడు వెల్లడించారు. జాన్ ఎఫ్. కెన్నడీ హత్యపై ట్రంప్ గతంలోనూ పలుమార్లు మాట్లాడారు. ఆయన మరణించి 60 ఏళ్లు అవుతోందని, ఇప్పటికీ ఆ హత్య రహస్యంగానే ఉందని వ్యాఖ్యానించారు. తాను తిరిగి వైట్‌హౌస్‌కు వస్తే.. ఆ పత్రాలన్నింటినీ బహిర్గతం చేస్తానని ఎన్నికల ప్రచారం సమయంలో హామీ ఇచ్చారు. 1961లో అమెరికాకు 35వ అధ్యక్షుడిగా జాన్ ఎఫ్.కెన్నడీ బాధ్యతలు చేపట్టారు. 43 ఏళ్లకే ఆ పీఠాన్ని అధిరోహించిన అతి పిన్న వయస్కుడిగా అరుదైన ఘనత సాధించారు. 1963 నవంబరు 22న టెక్సాస్ పర్యటనకు వెళ్లగా ఆయనపై దాడి జరిగింది. కాన్వాయ్‌లో ప్రయాణిస్తుండగా.. దుండగుడు వెనుక నుంచి కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఆయన ప్రాణాలు కోల్పోయారు. ఈ హత్య కేసులో తొలుత లీ హార్వే అనే వ్యక్తిని అరెస్టు చేయగా.. కేసు దర్యాప్తు జరుగుతున్న సమయంలో అతడు కూడా హత్యకు గురయ్యాడు. హార్వేను చంపిన వ్యక్తిని అరెస్టు చేసి శిక్ష వేయగా.. కొంతకాలం తర్వాత అతడు క్యాన్సర్‌తో మరణించాడు. నాటి నుంచి కెన్నడీ హత్య ఘటన రహస్యంగానే ఉంది.అమెరికా అటార్నీ జనరల్, సెనెటర్‌గా పనిచేసిన రాబర్ట్ ఎఫ్. కెన్నడీ 1968లో హత్యకు గురయ్యారు. అధ్యక్ష ఎన్నికలకు ముందు డెమోక్రటిక్ పార్టీ ప్రైమరీలు జరుగుతున్న సమయంలో ఇది చోటుచేసుకుంది. లాస్ ఎంజెలెస్‌లోని అంబాసిడర్ హోటల్‌లో కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించి బయటకు వస్తుండగా.. రాబర్ట్‌పై ఓ వ్యక్తి కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. నిందితుడిని పాలస్తీనాకు చెందిన సిర్హాన్‌గా గుర్తించారు. హక్కుల కార్యకర్త మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ కూడా 1968లోనే ఓ ర్యాలీలో మాట్లాడుతూ హత్యకు గురయ్యారు.

# ఆధ్యాత్మిక పర్యాటకంగా భారత్

### మహాకుంభమేళాపై విదేశీయుల ఆసక్తి

### భారీగా తరలి రావడంతో పెరిగిన ఆదాయం



**ప్రయాగ్‌రాజ్,జనవరి 24 :** 144 ఏళ్ల తర్వాత ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో జరుగుతున్న మహా కుంభ మేళాకు ప్రపంచ నలుమూలల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు. దీంతో విదేశీ టూరిజంలో గణనీయమైన పెరుగుదల కనిపించింది. ముఖ్యంగా బారత్ లో జరిగే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అమెరికా, యూకే వంటి దేశాల నుంచి పర్యాటకులు పోటెత్తుతున్నారు. దీంతో భారత్ ఆధ్యాత్మిక పర్యాటకానికి కేంద్రంగా మారుతుందన్న సూచనలు కనిపిస్తున్నాయి..ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళకు దేశంలోనే కాకుండా ప్రపంచ నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తున్నారు. దేశంలోని మతపరమైన ఆధ్యాత్మిక కార్యక్రమాలు యేటా మిలియన్ల మంది పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం ప్రపంచ దేశాల నుంచి దేశంలోని ఆధ్యాత్మిక కార్యక్రమాకు తరలి వస్తున్న

పర్యాటకుల్లో 21.4 శాతం పెరుగుదల కనిపిస్తుంది. ప్రముఖ వీసా ప్రాసెసింగ్ ప్లాట్‌ఫాం అట్లీస్ నివేదికల ప్రకారం.. దాదాపు 48 శాతం ఆధ్యాత్మిక ప్రయాణ వీసా అప్లికేషన్లు మహా కుంభ్ వంటి పెద్ద ఈవెంట్‌లు, తీర్థయాత్రలకు లింక్ చేసినట్లు వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో జరుగుతున్న మహా కుంభమేళా.. ప్రపంచంలోని అతిపెద్ద మతపరమైన కార్యక్రమాల్లో ఒకటి. 42 మిలియన్ల మంది యాత్రికులు కుంభ్ మేళాకు వస్తారని అంచనా. 144 ఏళ్లకు ఒకసారి జరిగే ఈ కార్యక్రమం దేశీయ, అంతర్జాతీయ సందర్శకులకు, భక్తులకు బాగా కనెక్ట్ అయ్యింది. దీంతో జా, జఐ వంటి దేశాల నుంచి కూడా ఆధ్యాత్మిక పర్యాటకుల సంఖ్య కూడా ఎన్నో రెట్లు పెరిగింది. వీరిలో మంది ప్రామాణికమైన, జీవితాన్ని మార్చే అనుభవాల కోసం అన్వేషిస్తున్నారు. సహస్రాబ్ది ఆధ్యాత్మిక యాత్రికులలో 66? మంది మహిళలు ఈ మార్పుకు నాయకత్వం వహిస్తున్నారు. సాంప్రదాయ పర్యాటక కార్యకలాపాల కంటే ఆధ్యాత్మిక, అర్ధవంతమైన ఈవెంట్ల కోసం ఎక్కువ మంది యువత సెలవులను కేటాయిస్తున్నారు. ఆధ్యాత్మిక పర్యాటకంలో కనిపించిన ఈ కొత్త ట్రెండ్.. గ్రూప్ ట్రావెల్ పట్ల ఆసక్తిని పెంచుతోంది. సమూహ ఆధ్యాత్మిక అనుభవాల కోసం ఇన్‌బౌండ్ ప్రయాణం కోసం ఏకంగా అప్లికేషన్లు 35 శాతం పెరిగాయట. గ్రూప్ టూరిజంలో భాగంగా పర్యాటకులు పవిత్ర ప్రదేశాలను సందర్శించినప్పుడు.. అక్కడి ఆచారాలలో పాల్గొనేందుకు అసక్తి చూసుతున్నారు. ముఖ్యంగా భారత్ ఆధ్యాత్మిక పర్యాటకం గత కొన్నేళ్లుగా బాగా పుంజుకుంది. వారణాసి, రిషికేశ్ వంటి ఆధ్యాత్మిక ప్రదేశాలు ఈ జాబితాలో ముందున్నాయి. ఇక్కడకు ప్రతి యేట మిలియన్ల మంది విదేశీ పర్యాటకులు వస్తుంటారు. గంగానది పక్కన ధ్యానం చేయడానికి, సాయంత్రం హారతి చూడటానికి



అమితాసక్తి కనబరుస్తున్నారు. ఆధ్యాత్మిక పర్యాటకం అభివృద్ధికి అధికారులు కూడా తీర్థయాత్రల చుట్టూ ఉన్న మౌలిక సదుపాయాలు, వసతిని అప్‌గ్రేడ్ చేశారు. ప్రపంచంలోని అన్ని ప్రాంతాల నుంచి ఆధ్యాత్మిక అన్వేషకులను స్వాగతించడానికి, మరిన్ని అనుభూతులను అందించడానికి భారత ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుంది. మహా కుంభ్ వంటి అరుదైన కార్యక్రమాలకు రికార్డు స్థాయిలో పర్యాటకులను ఆకర్షించడం, దాని ఆధ్యాత్మిక వారసత్వంపై పెరుగుతున్న ప్రపంచ ఆసక్తి వల్ల.. భారత్ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా మారనుంది.

# మీర్‌పేట్ మర్డర్ కేసులో మరింత లోతుగా విచారణ

### కాలిన స్థితిలో దొరికిన మాధవి వెంట్రుకలు

### ఇంట్లోనే కాల్చివేసినట్లు భావిస్తున్న పోలీసులు..

### డీఎన్‌ఏ పరీక్షల కోసం ల్యాబ్‌కు తరలింపు





హైదరాబాద్,జనవరి 24 :హైదరాబాద్‌లోని మీర్‌పేట్ మహిళ మర్డర్ కేసులో సంచలన విషయాలు వెలుగుచూస్తున్నాయి. ఇప్పటికే పోలీసులు రెండుసార్లు సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేశారు. నిందితుడు గురుమూర్తి పోలీసులకు పొంతన లేని సమాధానాలు చెబుతున్నట్లు తెలుస్తోంది. గురువారం పిల్లల స్టేట్మెంట్‌ను రికార్డు చేశారు. సంక్రాంతికి ఊరెళ్లి వచ్చిన తర్వాత కూతురు అమ్మ ఎక్కడ అని అడిగితే తన తండ్రి మౌనంగా ఉండిపోయినట్లు చెబుతోంది. ఇంట్లో భరించలేని దుర్వాసన వచ్చిందని పోలీసులకు చెప్పినట్లు సమాచారం. అటు, గురుమూర్తి ఇంటిని పోలీసులు మ–రోసారి తనిఖీ చేశారు. గురుమూర్తి తన భార్య మాధవి శరీర భాగాలను ఇంట్లోనే కాల్చిన ఆనవాళ్లను గుర్తించారు. మాధవి హెయిర్ శాంపిల్స్ కాలిన స్థితిలో దొరికాయి. వీటికి డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఆ నివేదిక ఆధారంగా నేర నిరూపణ సాధ్యమని భావిస్తున్నారు. ఇన్‌ఫ్రారెడ్ టెక్నాలజీ ద్వారా ఇంట్లో రక్తపు మరకలు గుర్తించారు. నిందితుడు గురుమూర్తి పూటకో మాట చెబుతూ పొంతన లేని సమాధానాలు చెప్తుండడంతో పోలీసులు షాక్ అవుతున్నారు. తన భార్యను తానే చంపినట్లు నేరం అంగీకరించిన నిందితుడు.. ఆ తర్వాత ఆధారాలు ఏమైనా ఉన్నాయా.? అంటూ పోలీసులనే ప్రశ్నించినట్లు తెలుస్తోంది. తాను కోర్టులో తేల్చుకుంటానంటూ వారికి సవాల్ చేసినట్లు సమాచారం. అటు, ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. చుట్టుపక్కల వారు కొందరు ఇళ్లకు తాళాలు వేసుకుని బంధువుల ఇళ్లకు వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ప్రకాశం జిల్లా రాచర్ల మండలం జేపీ చెరువుకు చెందిన గురుమూర్తి ఈ నెల 15న భార్య వెంకటమాధవిని హత్య చేశాడు. వీరు రంగారెడ్డి జిల్లా మీర్ పేట్ పీఎస్ పరిధిలోని బాలాపూర్ మండలం జిల్లెలగూడ న్యూ వెంకటేశ్వర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. భార్యను చంపడానికి ముందే పిల్లలను పండగ సెలవులకు హైదరాబాద్‌లోనే ఉంటున్న తాతగారి ఇంటికి పంపేశాడు. సంక్రాంతి రోజున భార్యను హత్య చేసిన అనంతరం మటన్ నరికే కత్తితో మృతదేహాన్ని ముక్కలు చేశాడు. ఆ తర్వాత శరీర భాగాలను కుక్కర్ లో ఉడికించాడు. అనంతరం వాటిని రోకలితో దంచి పొడి చేశాడు. ఆ పొడిని జిల్లెలగూడ చెరువులో పడేశాడు. ఈ నెల 17న అత్తగారికి ఫోన్ చేసి భార్య కనిపించడం లేదని చెప్పాడు. కూతురు అదృశ్యంపై వారు ఈ నెల 18న పోలీసులకు ఫిర్యాదు చేయగా.. విచారించిన పోలీసులు భర్త గురుమూర్తిపై అనుమానంతో తమదైన శైలిలో విచారించగా అసలు నిందితుడని తేలింది. భార్యను చంపడానికి ముందు ఓ కుక్కను చంపి ముక్కలుగా నరికి ట్రయల్ వేసినట్లు పోలీస్ విచారణలో వెల్లడైంది. అయితే, తొలుత అనుమానంతోనే భార్యను హత్య చేసినట్లు భావించిన పోలీసులకు విచారణలో మరిన్ని విషయాలు తెలిశాయి. నిందితునికి మరో మహిళతో అక్రమ సంబంధం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అందుకే తన భార్యను చంపి ఉంటాడని భావిస్తున్నారు. గురుమూర్తి ఫోన్ చూసిన పోలీసులకు దీనిపై ఓ క్లారిటీ వచ్చింది.



# మంత్రి ఉత్తమ్‌కుమార్ కాన్వాయ్‌కు ప్రమాదం

**హైదరాబాద్,జనవరి24 :** తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ కాన్వాయ్‌కు శుక్రవారం ప్రమాదం జరిగింది. హుజూర్‌నగర్ నుంచి జాన్‌పహాడ్ ఉర్సు ఉత్సవాలకు వెళ్తుండగా.. సూర్యాపేట మండల కేంద్రమైన గరిడేపల్లిలో కాన్వాయ్‌ని ఒక్కసారిగా ఆపడంతో వెనక నుంచి వస్తున్న వాహనాలు ఒకదానికొకటి ఢీ కొన్నాయి. 8 కార్ల ముందు భాగాలు ధ్వంసమయ్యాయి. మంత్రి ఉత్తమ్‌కు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో భద్రతా సిబ్బంది, నేతలు, కార్యకర్తలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనతో కొంతసేపు ఆందోళన నెలకొంది.

# దిల్‌రాజు ఇంట్లో ముగిసిన ఐటి సోదాలు

### పత్రాల ఆధారంగా వివరాల సేకరణలో అధికారులు



**హైదరాబాద్, జనవరి24 :** టాలీవుడ్ ప్రముఖ నిర్మాత దిల్ రాజు ఇంట్లో ఐటీ సోదాలు ముగిశాయి. నాలుగు రోజుల పాటు దిల్ రాజు నివాసంలో సుదీర్ఘంగా తనిఖీలు చేసిన ఐటీ అధికారులు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ఐటీ సోదాలు ముగిసిన తర్వాత దిల్‌రాజును శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ కార్యాలయానికి తరలించారు. దిల్ రాజు ప్రొడక్షన్స్ కార్యాలయాల్లోనూ సోదాలు నిర్వహిస్తున్నారు. రెండేళ్లుగా నిర్మించిన చిత్రాల వ్యయం, ఆదాయాలపై ఆరా తీస్తున్నారు. నాలుగు రోజుల పాటు జరిగిన ఐటీ సోదాల్లో కీలక అంశాలను గుర్తించారు. వచ్చిన లాభాలకు కట్టిన ట్యాక్స్‌కు వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. అలాగే సంక్రాంతికి వచ్చిన సినిమాల కలెక్షన్లపై ఐటీ అధికారులు ఫోకస్ పెట్టారు. దిల్‌రాజు ఇంట్లో కీలక పత్రాలను ఐటీ అధికారులు సీజ్ చేశారు. దిల్‌రాజు కార్యాలయంలో కూడా ముఖ్యమైన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం లీగల్ ఫార్మల్టీస్‌ను ఐటీ పూర్తి చేస్తోంది. దిల్ రాజ్ ఇళ్లు, కార్యాలయంతో పాటు కూతురు హన్సితా రెడ్డి ఇంట్లో సీజ్ అయిన పత్రాలను అధికారులు వెరిఫై చేస్తున్నారు. అలాగే టాలీవుడ్‌కు చెందిన పలువురు సినీ నిర్మాతల ఇళ్లు, కార్యాలయాల్లో వరుసగా నాలుగు రోజుల పాటు ఐటీ సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. సోదాల్లో భాగంగా కీలక అంశాలను గుర్తించింది ఐటీ. భారీగా నిధులు తరలించినట్లు అధికారులు ఓ అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. కీలక డాక్యుమెంట్లను సీజ్ చేసింది. గత రెండేళ్లుగా దిల్‌రాజు బ్యానర్‌లో నిర్మించిన సినిమాలకు సంబంధించి కొంత సమాచారాన్ని ఐటీ అధికారులు రాబట్టారు. పెట్టిన పెట్టుబడికి, వచ్చిన ఆదాయానికి భారీ వ్యత్యాసాలు ఉండటం.. వచ్చిన ఆదాయానికి, చెల్లించిన పన్నులకు కూడా పెద్ద మొత్తంలో వ్యత్యాసాన్ని గుర్తించింది ఐటీ. ఈ క్రమంలో టాలీవుడ్ ఇండస్ట్రీపై ఐటీ శాఖ విరుచుకుపడినట్లు తెలుస్తోంది. పుష్ప 2 సినిమాకు సంబంధించిన నిర్మాతల ఇళ్లలో కూడా దాదాపు మూడు రోజుల పాటు సోదాలు నిర్వహించారు. రూ.1800 కోట్ల ఆదాయం వచ్చినప్పటికీ పన్నుల చెల్లింపులు తక్కువగా ఉన్నట్లు ఐటీ నిర్ధారించింది. నాలుగు రోజులుగా 18 ప్రదేశాల్లో 55 మంది బృందాలుగా ఏర్పడి సోదాలు నిర్వహించారు. టాలీవుడ్‌లో ఎప్పుడూ లేని విధంగా టాలీవుడ్ ఇండస్ట్రీపై ఐటీ దాడులు చేసింది. గతంలో భారీ బ్జడెట్ సినిమాలు చేసిన ఆదాయం ఎక్కువగా వచ్చిందని ప్రకటించిన నిర్మాతల ఇళ్లలోనే ఐటీ అధికారులు దాడులు చేసిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఏకకాలంలో పెద్ద బ్యానర్స్ ఉన్న నిర్మాతలపై ఐటీ శాఖ దాడులు చేయడం హాట్‌టాపిక్‌గా మారింది. ఈరోజు మధ్యాహ్నం తరువాత ఐటీ శాఖ అధికారులు దాడులకు సంబంధించి స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది. అలాగే ఐటీ సోదాలపై నిర్మాత దిల్ రాజు కూడా మీడియాతో మాట్లాడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



# షమీని ఆడించకపోతే ఆ వార్తలే నిజమనుకొనే ప్రమాదం

## భారత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా



ఇంగ్లండ్‌తో భారత్ టీ20 సిరీస్ ఆడుతోంది. దాదాపు 14 నెలల తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగు పెట్టేందుకు సిద్ధమైన సీనియర్ పేసర్ మహ్మద్ షమీని మేనేజ్‌మెంట్ ఎంపిక చేసింది. కానీ, ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో అతడు బరిలోకి దిగలేదు. దీనికి కారణం ఏంటనేది కెప్టెన్ సూర్య కుమార్‌తోపాటు ఓపెనింగ్ బ్యాటర్ అభిషేక్ శర్మ ఇప్పటికే వెల్లడించారు. పిచ్ పరిస్థితుల ఆధారంగా ముగ్గురు స్పిన్నర్లను తీసుకోవాల్సి వచ్చిందని.. ఒకే ఒక్క ప్రధాన పేసర్‌తో ఆడినట్లు తెలిపారు. అయితే, మ్యాచ్‌కు ముందు ప్రాక్టీస్ సెషన్‌లో షమీ మోకాలికి బ్యాడ్ వేసుకొని బౌలింగ్ సాధన చేసిన వీడియోలు, ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. అతడి మోకాలిలో మళ్లీ స్వల్ప వాపు వచ్చిందనే వార్తలు చక్కర్లు కొట్టాయి. దీంతో ఇలాంటి వాటికి ముగింపు పలకాలంటే షమీని ఆడించాలని భారత మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత ఆకాశ్ చోప్రా సూచించాడు. మేనేజ్‌మెంట్ చెబుతోన్న కారణాలు సరిగ్గా లేవనిపిస్తోందని వ్యాఖ్యానించాడు. "ఐదు టీ20ల సిరీస్‌లో ఒక మ్యాచ్ ముగిసింది. ఇంకా నాలుగు మిగిలి ఉన్నాయి. తొలి మ్యాచ్‌లో షమీని ఆడించలేదు. అతడికి తుది జట్టులో అవకాశం కల్పించలేదంటే వందశాతం ఫిట్‌గా లేడని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. 'పిచ్ బాగోలేదు.. అందుకే అదనంగా స్పిన్నర్‌ను తీసుకున్నాం. రవి బిష్ణోయ్‌తో కలిపి ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగాము' అని చెబుతున్నారు. కానీ, నాకు ఆ సమాధానం సరిగ్గా లేదనిపిస్తోంది. ఇలాంటి వాటిని పక్కన పెట్టేసి.. షమీని ఆడించాలి. ఇంకా నాలుగు మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయి. తరచూ వేదికలు మారుతూ ఉండాలి. అయినా అతడిని ఆడించలేదంటే ఇంకా పూర్తిస్థాయిలో ఫిట్‌నెస్ సాధించలేదనే భావించాలి. ఈ విషయంలో ఫ్యాన్స్ తీవ్ర ఆందోళనతో ఉన్నారు. కీలకమైన ఛాంపియన్స్ ట్రోఫీ ముందుంది. ఈ క్రమంలో షమీకి మరిన్ని అవకాశాలు ఇవ్వాలి. లేకపోతే అంతర్జాతీయ మ్యాచులకు తగ్గట్టు సిద్ధంకావడం ఇబ్బందిగా మారే ప్రమాదం ఉంది" అని చోప్రా వెల్లడించాడు. రెండో టీ20 మ్యాచ్ శనివారం చెన్నై వేదికగా జరగనుంది.

### ఇది నిర్భయంగా ఆడే జట్టు : సంజయ్ మంజ్రేకర్

ఇంగ్లండ్‌పై అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడిన యువ ఓపెనర్ అభిషేక్ శర్మను మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ అభినందించాడు. "నూతన భారత జట్టు నిర్భయంగా ఆడుతోంది. ఇలా చూడటం చాలా ఆనందంగా ఉంది. ఎవరూ కూడా వ్యక్తిగత మైలురాళ్ల కోసం చూడటం లేదు. నిస్వార్థ క్రికెటర్ ఎప్పుడైనా సరే టీ20ల్లో అత్యంత డేంజరస్ బ్యాటర్" అని వ్యాఖ్యానించాడు. అభిషేక్ కేవలం 34 బంతుల్లోనే 79 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

# భారత్‌కు అదృష్టం కలిసొచ్చింది.. రెండో టీ20లో వదిలిపెట్టం : ఆర్చర్





భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య ఐదు టీ20ల సిరీస్ కొనసాగుతోంది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. పర్యటక జట్టు నిర్దేశించిన 133 పరుగుల లక్ష్యాన్ని 13 ఓవర్లలోపే టీమ్ ఇండియా ఛేదించింది. అయితే, భారత బ్యాటర్లకు అదృష్టం కలిసొచ్చి విజయం ఆ జట్టు సాధించిం దని.. రెండో టీ20లో మాత్రం వదిలే ప్రసక్తే లేదని ఇంగ్లండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ వ్యాఖ్యానించాడు. చాలా బంతులు గాల్లోకి లేచి ఫీల్డర్లకు దూరంగా వెళ్లడంతో భారత బ్యాటర్లు ఔట్ కాలేదన్నాడు. అవన్నీ జరిగితే టాప్ 6 బ్యాటర్లను 40 పరుగులకే కట్టడి చేసేవాళ్లమన్నాడు. రెండో మ్యాచ్ చెన్నై వేదికగా శనివారం జరగనుంది. "ఈడెన్ గార్డెన్స్ పిచ్ ఇతర బౌలర్లతో పోలిస్తే నాకు కాస్త అదనంగా సహకరించింది. ఇతరులూ మంచిగానే బౌలింగ్ చేశారు. కానీ, బ్యాటర్లకు అదృష్టం కలిసొచ్చింది. కొన్ని బంతులు గాల్లోకి లేచినా.. ఫీల్డర్లకు కాస్త దూరంగా పడ్డాయి. అయితే, వచ్చే మ్యాచ్‌లో అవి సరిగ్గా చేతుల్లోనే పడతాయని భావిస్తున్నా. అలాగే భారత్‌ను 40/6కు కట్టడి చేస్తాం. ఉపఖండంలో ఆడేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. వారి బ్యాటర్లు దూకుడుగా ఆడతారు. ఈడెన్ గార్డెన్స్ మ్యాచ్‌లో మేం విజయావకాశాలను మిస్ చేసుకున్నాం. తొలుత బ్యాటింగ్‌లో త్వరగా వికెట్లను కోల్పోవడం వల్ల నష్టం కలిగింది. అలాగే ప్రత్యర్థి లక్ష్య ఛేదన సమయంలో పవర్ ప్లే అత్యంత కీలకం. కనీసం మూడు లేదా నాలుగు వికెట్లు తీస్తే మాత్రం మ్యాచ్‌పై పట్టు సాధించేందుకు అవకాశం ఉండేది. అప్పుడు మధ్య ఓవర్లలో ఆట మరోలా సాగేది. ఈడెన్ గార్డెన్స్‌లో చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. తర్వాత మ్యాచ్‌లో తప్పకుండా గెలుస్తాం" అని ఆర్చర్ వెల్లడించాడు.



# వీరేంద్ర సెహ్వాగ్ జంట విడిపోనుందా..?

సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉండే టీమ్‌ఇండియా మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్.. ఈసారి వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయంతో వార్తల్లో నిలిచారు. ఈ మాజీ క్రికెటర్ తన 20 ఏళ్ల వైవాహిక బంధానికి స్వస్తి పలుకుతున్నట్లు తెలుస్తోంది. తన భార్య ఆర్తి అహ్లావత్‌తో విడిపోతున్నట్లు సమాచారం. వీరిద్దరూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకోవడంతో ఈ వార్తలు గుప్పుమన్నాయి. వీరేంద్ర సెహ్వాగ్ 2004 డిసెంబరులో ఆర్తి అహ్లావత్‌ను వివాహం చేసుకున్నారు. వీరికి ఆర్యవీర్, వేదాంత్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. దాదాపు రెండు దశాబ్దాల పాటు వైవాహిక బంధంలో ఉన్న వీరి మధ్య కొన్ని నెలల కిందట మనస్పర్థలు తలెత్తినట్లు తెలుస్తోంది. దీంతో వీరిద్దరూ కొంతకాలంగా విడివిడిగా ఉంటున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే సెహ్వాగ్ చేసే ఇన్‌స్టా పోస్టుల్లో సతీమణి కన్పించకపోవడంతో వీరిద్దరూ విడిపోతున్నారనే ఊహాగానాలు మొదలయ్యాయి. గతేడాది దీపావళి పర్వదినం నాడు సెహ్వాగ్.. తన కుమారులు, తల్లితో దిగిన ఫొటోలను పంచుకున్నారు. చివరిసారిగా 2023లో తమ పెళ్లి రోజు సందర్భంగా భార్యతో దిగిన ఫొటోను పోస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో తాజాగా ఆర్తిని తన ఇన్‌స్టా ఖాతాలో అన్‌ఫాలో చేయడంతో విడాకుల వార్తలకు మరింత బలం చేకూర్చినట్లయ్యింది. అయితే, ఈ వార్తలపై సెహ్వాగ్ నుంచి గానీ, ఆయన భార్య నుంచి గానీ ఎలాంటి స్పందన రాలేదు.

# జకోవిచ్ వాకోవర్.. ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌కు అలెగ్జాండర్ జ్వెరెవ్



కెరీర్‌లో 25వ గ్రాండ్ స్లామ్‌ను నెగ్గాలనే లక్ష్యం తో ఉన్న సెర్బియా టెన్నిస్ స్టార్ నొవాక్ జకోవిచ్‌ను గాయం ఇబ్బంది పెట్టింది. ఆస్ట్రేలియన్ ఓపెన్ 2025 సెమీస్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్‌పై మ్యాచ్‌లో బరిలోకి దిగి తొలి సెట్ అనంతరం వాకోవర్ ఇచ్చేశాడు. గాయం కారణంగా ఈ నిర్ణయం తీసుకొన్నట్లు వెల్లడించి.. అభిమానులకు అభివాదం చేస్తూ కోర్టును వీడాడు. దీంతో ఫ్యాన్స్ ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఈ నేపథ్యంలో జర్మనీ స్టార్ జ్వెరెవ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌కు చేరాడు. ఇవాళే జరగనున్న రెండో సెమీస్‌లో విజేతగా నిలిచే ఆటగాడితో అతడు టైటిల్ కోసం పోరాడతాడు. ఇటలీకి చెందిన డిఫెండింగ్ ఛాంపియన్ సినర్‌తో అమెరికా సంచలనం బెన్ షెల్టన్ మరో సెమీస్‌లో తలపడనున్నాడు. ఆదివారం ఫైనల్ జరగనుంది.



# అంతర్గతంగా 1000 విషయాలు మాట్లాడుకుంటాం..

## బయటకు అన్నీ చెప్పం : పంత్

ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధరను సొంతం చేసుకున్న రిషభ్ పంత్ ఇప్పుడు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు కెప్టెన్‌గా నియమితులయ్యాడు. మెగా వేలంలో తీవ్ర పోటీ వచ్చినా.. లఖ్‌నవూ మాత్రం ఫైనల్ బిడ్డింగ్‌తో రూ.27 కోట్లు వెచ్చించింది. మార్చి 21 నుంచి ఐపీఎల్ 2025 సీజన్ ప్రారంభం కానుందని ఇప్పటికే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సోషల్ మీడియా వేదికగా వచ్చే ట్రోలింగ్, విమర్శల నుంచి జట్టు సభ్యులను ఎలా రక్షించుకుంటావనే ప్రశ్నకు పంత్ సమాధానం ఇచ్చాడు. అలాగే టీమ్ సహచరులకూ కీలక సూచనలు చేశాడు. అంతర్గతంగా సంభాషించుకొనే ప్రతి విషయాన్నీ బయటకు వెల్లడించా ల్సిన అవసరం లేదని పేర్కొన్నాడు. "జట్టు అంతర్గత సమావేశాల్లో 1000 విషయాలు మాట్లాడుకుంటాం. కానీ, బయటకు వచ్చేసరికి ప్రతి ఆటగాడికీ కెప్టెన్‌గా మద్దతు ఇస్తానని చెబుతా. వారి వెనుకుండి అవసరమైన సాయం అందిస్తా. కొన్నిసార్లు ప్లేయర్లను ట్రోలింగ్ లేదా విమర్శల నుంచి రక్షించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతి విషయం ప్లేయర్లతో చెప్పాల్సిన అవసరమూ లేదు. కొన్నిసార్లు డ్రెస్సింగ్ రూమ్ విషయాలు బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇకపోతే, ఆటగాడిగా నా ముందున్న కర్తవ్యం 200 శాతం నా అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించడమే. మైదానంలోకి దిగాక మరే ఇతర విషయం గురించి ఆలోచించను. మ్యాచ్ పరిస్థితులకు తగ్గట్టు ఆడేందుకు ప్రయత్నిస్తా. జట్టు విజయాల్లో నా భాగస్వామ్యం ఉందా? లేదా? అనేది చూసుకుంటా" అని తెలిపాడు.

### ప్రమాదం తర్వాత చాలా మారిపోయా

భారత జట్టుకు భవిష్యత్తు సారథి రిషభ్ పంత్ కావొచ్చంటూ వస్తోన్న వార్తలపైనా పంత్ స్పందించాడు. తనకు రోడ్డు ప్రమాదం జరగకు ముందు అలానే ఆలోచించేవాడినని.. ఇప్పుడు మాత్రం ఆటపైనే దృష్టిపె ట్టినట్లు తెలిపాడు. "గతంలో నేనూ కెప్టెన్సీ గురించి ఆలోచించా. ప్ర మాదం జరగకముందు చాలా తీవ్రంగా ఆలోచించిన దాఖలాలు ఉన్నాయి. కానీ, ఇప్పుడు మాత్రం ఏం జరగాలని ఉంటే అదే జరుగు తుందని భావిస్తున్నా. రోడ్డు ప్రమాదం చాలా అంశాలను నేర్పింది. ధోనీ గతంలో చెప్పినట్లు 'మన కర్తవ్యం మీద దృష్టిపెడితే.. ఫలితం దానంతట అదే వస్తుంది' అనే మాటలను ఇప్పుడు పాటిస్తున్నా. ఇలా చెప్పడం చాలా సులువు. కానీ, చేయడమే ఎంతో కష్టం" అని పంత్ వెల్లడించాడు.




# వన్డే టీమ్ ఆఫ్ ది ఇయర్ 2024

## ఒక్క భారత క్రికెటర్‌కూ దక్కని చోటు!




వన్డే టీమ్ ఆఫ్ ది ఇయర్ 2024 జట్టులో ఎవరు ఉన్నారో ఐసీసీ ప్రకటించింది. ఇందులో కనీసం ఒక్క భారత ప్లేయర్‌కు చోటు కల్పించకపోవడం ఇప్పుడు అభిమానుల్లో కొత్త చర్చకు దారితీసింది. 11 మందితో కూడిన ఈ జట్టుకు సారథిగా శ్రీలంక ఆటగాడు చరిత్ అసలంకను ఎంపిక చేసింది. ఉపఖండానికి చెందిన 10 మంది ప్లేయర్లకు అవకాశం ఇవ్వడం గమనార్హం. ఇక టీమ్‌లో శ్రీలంక నుంచి నలుగురు, పాకిస్థాన్ నుంచి ముగ్గురు, అఫ్గానిస్థాన్ నుంచి ముగ్గురు, విండీస్ నుంచి ఒకరికి ఛాన్స్ దక్కింది.

### కారణం ఇదేనా?

భారత్ నుంచి ఒక్క ఆటగాడికి ఫైనల్ 11లో చోటు దక్కకపోవడానికి కారణముందని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. గతేడాది కేవలం మూడు వన్డే మ్యాచ్‌లను మాత్రమే ఆడింది. అందులో ఒక్క విజయం కూడా సాధించలేదు. టీ20 ప్రపంచ కప్‌తోపాటు, టెస్టు ఛాంపియన్‌షిప్ నేపథ్యంలో ఎక్కువగా టీ20లు, టెస్టులను మాత్రమే టీమ్‌ఇండియా ఆడింది. శ్రీలంకతోనే మూడు వన్డేల సిరీస్‌లో బరిలోకి దిగింది. ఒక్క మ్యాచ్ కూడా గెలవలేకపోయింది. తొలి రెండు మ్యాచుల్లో లంక విజయం సాధించగా.. చివరి వన్డే టైగా ముగిసింది. మిగతా జట్ల కంటే శ్రీలంక, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్ ఎక్కువగా వన్డే ఫార్మాట్‌లో మ్యాచ్‌లు ఆడటంతో వారికి అవకాశం దక్కి ఉంటుందని క్రీడా పండితులు విశ్లేషిస్తున్నారు.

### టీమ్ ఇదే..

సైమ్ అయూబ్ (పాకిస్థాన్), రహ్మానుల్లా గుర్బాజ్ (అఫ్గానిస్థాన్), పాథున్ నిస్సాంక (శ్రీలంక), కుశాల్ మెండిస్ (శ్రీలంక), చరిత్ అసలంక (కెప్టెన్) (శ్రీలంక), షెర్ఫానె రూథర్‌ఫోర్డ్ (వెస్టిండీస్), అజ్మతుల్లా ఒమర్జాయ్ (అఫ్గానిస్థాన్), వనిందు హసరంగ (శ్రీలంక), షహీన్ షా అఫ్రిది (పాకిస్థాన్), హారిస్ రవూఫ్ (పాకిస్థాన్), ఏఎం ఘజాన్‌ఫర్ (అఫ్గానిస్థాన్).

# రెండో ఇన్నింగ్స్‌లో కాస్త మెరుగైన రోహిత్-యశస్వి బ్యాటింగ్

జమ్ముకశ్మీర్‌తో రంజీ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో సింగిల్ డిజిట్‌కే పరిమితమైన భారత స్టార్ ఓపెనర్లు రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్ కొంచెం పుంజుకొన్నారు. రెండో ఇన్నింగ్స్‌లో ఇద్దరూ కలిసి హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నిర్మించారు. రోహిత్ మొదటి ఇన్నింగ్స్‌లో 3 పరుగులే చేయగా.. ఈసారి మాత్రం 35 బంతులను ఎదుర్కొని 28 పరుగులు సాధించాడు. ఇందులో మూడు సిక్స్‌లు, రెండు ఫోర్లు ఉన్నాయి. తనదైన శైలిలో షాట్ పిచ్ బంతిని లెగ్‌సైడ్ సిక్స్‌గా మలిచాడు. స్ట్రెయిట్‌గా కొట్టిన సిక్స్ కూడా మ్యాచ్‌కు హైలైట్. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో ఇలానే పుల్ చేయబోయి ఔటైన సంగతి తెలిసిందే. అయితే, జమ్ముకశ్మీర్ బౌలర్ యుధ్‌వీర్ వేసిన బంతిని ఆడబోయిన రోహిత్‌కు అదృష్టం కలిసిరాలేదు. బ్యాట్ ఎడ్జ్‌ను తీసుకున్న బంతిని మిడాన్‌లో అబిద్ అద్భుతంగా క్యాచ్ పట్టాడు. దీంతో హిట్‌మ్యాన్ నిరాశగా పెవిలియన్‌కు చేరాడు. కాసేపటికే యశస్వి జైస్వాల్ (26) కూడా యుధ్‌వీర్ బౌలింగ్‌లోనే ఔటయ్యాడు. అతడు తొలి ఇన్నింగ్స్‌లో 4 పరుగులకే పరిమితమైన సంగతి తెలిసిందే.

### శ్రేయస్ ఔట్ వివాదాస్పదం..

ముంబయి ఇన్నింగ్స్ 22వ ఓవర్‌లో శ్రేయస్ అయ్యర్ (17) పెవిలియన్‌కు చేరాడు. జమ్ము కశ్మీర్ బౌలర్ నబీ వేసిన ఆఫ్‌సైడ్ బంతిని ఆడే క్రమంలో బ్యాట్‌ను తాకి వికెట్ కీపర్ వైపు వెళ్లింది. అతడు క్యాచ్‌ను అందుకొని అప్పీలు చేశాడు. శ్రేయస్ మాత్రం బంతి ముందే నేలను తాకిందనే ఉద్దేశంతో క్రీజ్‌లోనే ఉన్నాడు. కానీ, అంపైర్ మాత్రం ఫీల్డింగ్ జట్టు అప్పీలుకు స్పందించి ఔట్‌గా ప్రకటించాడు. కనీసం థర్డ్ అంపైర్‌కు నివేదించకుండానే ఎలా నిర్ణయం ప్రకటిస్తారని శ్రేయస్‌తోపాటు నాన్‌స్ట్రైకింగ్‌లో ఉన్న ముంబయి కెప్టెన్ అజింక్య రహానె అంపైర్లను ప్రశ్నించారు. వారు మాత్రం సరైన క్యాచ్‌గానే భావిస్తున్నట్లు చెప్పడంతో శ్రేయస్ నిరాశగా డగౌట్‌కు చేరాడు. అనంతరం క్రీజ్‌లోకి వచ్చిన శివమ్ దూబె (0) మరోసారి డకౌట్ కావడం గమనార్హం. నబీ సంధించిన ఇన్‌స్వింగర్‌కు స్లిప్‌లో దొరికిపోయాడు.


### కష్టాల్లో ముంబయి..

దేశవాళీ క్రికెట్‌లో ముంబయి ఎదురులేని జట్టు. ఇప్పుడు హేమాహేమీ క్రికెటర్లు బరిలోకి దిగారు. అయితే, వారు పెద్దగా రాణించకపోవడంతో జమ్ముకశ్మీర్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో కష్టాల్లో పడింది. తొలి ఇన్నింగ్స్‌లో ముంబయి 120 పరుగులు చేయగా.. జమ్ముకశ్మీర్ 206 పరుగులకు ఆలౌటైంది. దీంతో 86 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ముంబయి రెండో రోజు లంచ్ బ్రేక్ సమయానికి ఐదు వికెట్లను కోల్పోయి సరిగ్గా 86 పరుగులు చేసింది. ప్రస్తుతం క్రీజ్‌లో అజింక్య రహానె ఉన్నాడు.



## ప్రతిదాన్ని చివరిగా భావించే దశలో ఉన్నా : సమంత

తెలుగు, తమిళం, హిందీ భాషల్లో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న భామల్లో స్టార్ నటి సమంత ఒకరు. రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో వచ్చిన సిటాడెల్ వెబ్ ప్రాజెక్ట్‌తో బిజీగా మారిన ఈ బ్యూటీ.. విడుదల తర్వాత రిలాక్సేషన్ మూడ్‌లోకి వెళ్లిపోయింది. ఇప్పుడు మళ్లీ చాలా కాలం తర్వాత బిజీగా మారిపోయారు. వరుస ఈవెంట్స్‌లో పాల్గొంటూ అభిమానులను అలరిస్తున్నారు. అయితే, జీవితంలో ప్రతి దాన్ని చివరిదిగా భావించే దశలో తాను ఉన్నానని సామ్ తాజాగా తెలిపారు. ఈ మేరకు ఓ ఆంగ్ల మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా సామ్ మాట్లాడుతూ.. సాధారణంగా ఉండే సినిమాలను ఎన్నో అంగీకరించొచ్చన్నారు. తాను మాత్రం కచ్చితంగా ప్రేక్షకులపై ప్రభావాన్ని చూపే వాటినే ఎంపిక చేసుకుంటున్నట్లు తెలిపారు. వంద శాతం నమ్మితేనే ఆ పాత్రలను చేస్తానని, లేకపోతే చేయలేనని తెలిపారు. సవాలుగా అనిపించే పాత్రలనే ఎంపిక చేసుకుంటున్నట్లు వెల్లడించారు. రాజ్ అండ్ డీకే ఎక్కువగా సవాలుగా అనిపించే పాత్రలనే రూపొందిస్తున్నారని.. వారితో వర్క్ చేయడం తనకు ఎంతో సంతృప్తిగా ఉంటుందని సామ్ చెప్పుకొచ్చారు. గొప్ప సినిమాలో నటించాననే ఫీల్ రాకపోతే వర్క్ చేయలేనని సామ్ వివరించారు. విజయ్ దేవరకొండతో చివరగా ఖుషి సినిమాలో నటించింది సమంత. ఈ సినిమా తర్వాత తెలుగులో మళ్లీ కొత్త ప్రాజెక్టు ప్రకటించలేదు.



## 'పుష్ప 3' ఐటెమ్ సాంగ్‌లో.. జాన్వీ!

'పుష్ప' సిరీస్ చిత్రాలు ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు సాధించాయి. సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా వచ్చిన ఈ చిత్రాలను దేవిశ్రీ ప్రసాద్ అందించిన సంగీతం మరోస్థాయికి తీసుకెళ్లింది. వీటిల్లో ఐటెమ్ సాంగ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సంగతి తెలిసిందే. తాజాగా దీని మూడో పార్ట్‌లో ఐటెమ్ సాంగ్‌లో నటి జాన్వీ కపూర్ డ్యాన్స్ వేస్తే బాగుంటుందని దేవిశ్రీ ప్రసాద్ అభిప్రాయపడ్డారు. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దీని గురించి మాట్లాడారు. "పుష్ప 2'లోని కిస్సిక్ పాటలో ఎవరు నటించినా అంతర్జాతీయ స్థాయిలో పాపులర్ అవుతారని మాకు ముందే తెలుసు. శ్రీలీల అద్భుతమైన డ్యాన్సర్ కాబట్టి ఆమెను తీసుకుంటే బాగుంటుందని మేకర్స్‌కు చెప్పాను. ఎంతోమంది అగ్ర కథానాయికలు మొదటిసారి నా కంపోజిషన్‌లోనే ప్రత్యేక గీతాల్లో అలరించారు. పూజా హెగ్డే, సమంత, శ్రీలీల, కాజల్ అగర్వాల్ వీళ్లందరూ అగ్రస్థానంలో ఉన్నప్పుడే ఐటెమ్ సాంగ్‌ల్లో నటించారు. ఇక పుష్ప 3 సినిమాలో ఐటెమ్ సాంగ్‌లో కనిపించేవారి గురించి ఎప్పటి నుంచో ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీనిపై దర్శక నిర్మాతలు తుది నిర్ణయం తీసుకుంటారు. పాట ఆధారంగా హీరోయిన్‌ను ఎంపిక చేస్తారు. మంచి డ్యాన్సర్లు అయితే బాగుంటుంది. సాయి పల్లవి డ్యాన్స్‌కు నేను అభిమానిని. అలాగే జాన్వీ కపూర్ అద్భుతమైన డ్యాన్సర్. ఆమె పాటలు కొన్ని చూశాను. శ్రీదేవిలో ఉన్న గ్రేస్ ఆమెలో ఉంది. జాన్వీ అయితే ఆ పాటకు సరైన ఎంపిక అని నేను అనుకుంటున్నా. ఇలాంటి పాటలు హిట్ కావడానికి డ్యాన్స్ కూడా ముఖ్య కారణం" అని చెప్పారు. 2021లో విడుదలై సూపర్‌హిట్ అందుకున్న 'పుష్ప: ది రైజ్'కి సీక్వెల్‌గా 'పుష్ప: ది రూల్'ను తెరకెక్కించారు. 2024 డిసెంబర్‌లో విడుదలైన ఈ చిత్రం ఇప్పటికీ థియేటర్‌లలో సందడి చేస్తోంది. వసూళ్ల విషయంలో 'బాహుబలి 2' రికార్డును బ్రేక్ చేసింది. రూ.2000 కోట్లకు చేరువలో ఉంది. ఇటీవలే అదనపు సన్నివేశాలను (20 నిమిషాల నిడివి) జోడించారు. దీనికి కొనసాగింపుగా 'పుష్ప3: ది ర్యాంపేజ్' పేరుతో మూడో భాగం సిద్ధం కానుంది.

## యశ్ చిత్రంలో నయనతార



యశ్ హీరోగా మలయాళ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ 'టాక్సిక్'ను తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషించనున్నారంటూ ఎంతో మంది కథానాయికల పేర్లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ప్రాజెక్టులో నయనతార భాగమైనట్లు బాలీవుడ్ నటుడు అక్షయ్ ఒబెరాయ్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. "ప్రస్తుతం నేను రాకింగ్ స్టార్ యశ్ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నా. దీనిలో నయనతార కూడా భాగమయ్యారు. ఇంతకు మించి వివరాలను నేను ఇప్పుడే వెల్లడించకూడదు. త్వరలోనే గీతూ మోహన్ దాస్ ఓ ప్రకటన చేస్తారు. అప్పటి వరకు వేచిచూడండి" అని అక్షయ్ అన్నారు. నయనతార ఏ పాత్రలో కనిపించనున్నారనే దానిపై స్పష్టత లేదు. ఇక ఇందులో బాలీవుడ్ నటి కరీనాకపూర్ కూడా నటించనున్నట్లు తొలుత వార్తలు వచ్చాయి. అయితే వీటిపై గతంలో టీమ్ స్పందిస్తూ అధికారిక సమాచారం కోసం వేచి ఉండాలని కోరింది. ఈ చిత్రం ప్రకటించిన తర్వాత ఇప్పటి వరకు నటీనటుల గురించి వెల్లడించలేదు. అక్షయ్ ఒబెరాయ్ భాగమైనట్లు తెలుపుతూ ఇటీవల ఓ పోస్టర్ విడుదల చేశారు. యశ్ నటిస్తున్న 19వ చిత్రమిది. ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్.. అన్నది ఉపశీర్షిక. ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకురానుంది. 'కేజీఎఫ్' సిరీస్ విజయాల తర్వాత యశ్ నుంచి వస్తున్న సినిమా కావడంతో దీనిపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా యశ్ పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక వీడియోను టీమ్ షేర్ చేసింది. అది యూట్యూబ్‌లో భారీ వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986